
ప్రజాశక్తి
సోమవారం 19 ఆగస్టు 2025 | 12 పేజీలు



తిరుపతి



చిత్తూరు

వికలాంగులంటే 'వివక్ష'..!



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రత్యేక ప్రతిభావంతుల్లో పింఛన్ టెన్షన్ నెలకొంది. 'మీరు అర్హులు కాదు' అంటూ తిరుపతి జిల్లాలో 30వేల మందికి పైగా నోటీసులు జారీ అయ్యాయి. సెప్టెంబర్ 1 నుంచి పింఛన్ ఆపేస్తామని నోటీసుల్లో అధికారులు పేర్కొనడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. 'మీ ఇంటికి పెద్దకొడుకులా మీకు ప్రతినెలా పింఛన్ ఇచ్చి అండగా ఉంటా' అని నమ్మబలికిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరకే 'సర్వేల పేరుతో' ఏరివేత కార్యక్రమం చేపట్టడంపై వారు భగ్గుమంటున్నారు.

తిరుపతి జిల్లాలో 34 మండలాల్లో 2లక్షల 63వేల 743 మందికి 27 కేటగిరీల కింద వికలాంగ పింఛన్ అందుతోంది. రూ.4వేల నుంచి 15వేల వరకూ నెలనెలా మొదటి తేదీనే

2లో

30వేల పింఛన్లకు ఎసరు
ప్రత్యేక ప్రతిభావంతులు లబోదిబో
'కోత' పెట్టడమే 'కూటమి' లక్ష్యమా..!



పింఛన్లు ఆపేస్తున్నారని చిత్తూరు కలెక్టర్ వద్ద వికలాంగులు లబోదిబో

రోజుకు 60వేల పైనే ప్రయాణం

'స్త్రీశక్తి' రైట్‌రైట్

త్వరలోనే మహిళలకు 'స్మార్ట్‌కార్డు'

అంతర్రాష్ట్ర సర్వీసులకూ అనుమతి..?

2లో

వార్త తరువాయి..

వికలాంగులంటే 'వివక్ష'..!

కూటమి ప్రభుత్వంలో ఇంటికే వచ్చి ఇస్తున్నారు. వికలాంగులకైతే రూ.6-15వేలు ఇస్తున్నారు. వారికి ఉన్న 'వైకల్య పర్సంటేజ్' ఆధారంగా 'సదరం' సర్టిఫికేట్ ఆధారంగా ఎంత ఇవ్వాలనేది నిర్ణయిస్తారు. 30వేల మంది పైనే ప్రత్యేక ప్రతిభావంతులు అనర్హులని కూటమి ప్రభుత్వం తేల్చి, వారికి నోటీసులను తాజాగా అందజేసింది. తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లోని మంగళం, బిటిఆర్ కాలనీ మంగళం ప్రాంతంలో సోమవారం 100 మంది పైగా వికలాంగులకు 'మీరు వికలాంగ పింఛన్‌కు అనర్హులు, సెప్టెంబర్ ఒకటో తేదీ మీకు పింఛన్ నిలిపేస్తున్నాం' అని కమిషనర్ మౌర్య పేరుతో నోటీసులను సిబ్బంది అందజేశారు. దీంతో వికలాంగులు ఇదేం అన్యాయం అంటూ లబోదిబోమంటున్నారు.

పదేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నా : మునిరెడ్డి, బిటిఆర్ కాలనీ



పుట్టినప్పటి నుంచే అంగవైకల్యం. రెండు చేతులూ సరిగ్గా పనిచేయవు. ఏ పనీ చేయలేను. 1999లో 86 శాతం వైకల్యం ఉందని ఎస్వీ మెడికల్ కాలేజ్ ధృవీకరించి సర్టిఫికెట్ ఇచ్చింది. ఆ తరువాత 2015లో రీ వెరిఫికేషన్ చేసి అదే కాలేజీలో 68 శాతం ఉందని చెప్పింది. పదేళ్లుగా పింఛన్ తీసుకుంటూనే ఉన్నా. ఇపుడు 40 శాతం కంటే తక్కువగా ఉందని పింఛన్‌కు అర్హుడు కాదంటూ నోటీసులు ఇచ్చారు. నోటీసు చూసి నోట మాట రాలేదు. 'బతుకుపై భయం పట్టుకుంది.. ఎలా బతకాలో' అనే ఆందోళన మొదలయ్యింది. నాకే కాదు మా కాలనీలో 100 మందికి పైగా నోటీసులు ఇచ్చారంట. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పింఛన్ ఆగిపోతే జీవనం గడవడం కష్టమే.

పారదర్శకంగా చేశాం : టిఎన్ శోభన్‌బాబు, డిఆర్‌డిఎ పిడీ

ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ వైద్య, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో సర్వేను పారదర్శకంగా చేశాం. 40శాతం కంటే తక్కువ ఉన్న వారిని 30వేలకు పైగా గుర్తించాం. అందరికీ నోటీసులు పంపించి ముందస్తుగానే ప్రభుత్వపరంగా తెలియజేస్తున్నాం. వీరికి సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పింఛన్లు ఆగిపోతాయి. పింఛన్లు ఆగిపోయిన వారు రీ వెరిఫికేషన్ కోసం ఆయా మండల ఎంపిడిఒలను కలిసి విన్నవించుకోవచ్చు.

చిరుత బోనులో చిక్కింది

చిన్నపులుల సంగతేంటి..?

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిపాలనా భవనం వెనుక భాగంలో అటవీశాఖ అధికారులు చిరుత పులిని ఆదివారం రాత్రి 11.30 సమయంలో బోను ద్వారా బంధించి నట్టు, ఉదయం దానిని తరలించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య అప్పారావు వివరాలు తెలియజేస్తూ విశ్వవిద్యాలయంలో గత మూడు వారాలుగా తిరుగుతున్న చిరుత అందరినీ భయభ్రాంతులకు గురిచేసిందని, అలిపిరి, వేదిక్ యూనివర్సిటీ మార్గంలో మోటారు బైకుపై వెళ్తున్న వారిపై దాడిచేసి యస్వీయూలో చేరినట్టు సమాచారం అందిందని తెలిపారు. రాత్రి దానిని బంధించి ఉపశమనం కలిగించినందుకు అటవీశాఖ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అయితే విశ్వవిద్యాలయంలో తిరిగే ప్రతి ఒక్కరూ రాత్రుళ్లు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం వుందని తెలిపారు. తిరుపతిలోని పలు ప్రాంతాల్లో చిరుతల సంచారం భయాందోళనకు గురిచేస్తోంది.. జూపార్క్ రోడ్డులో తరచూ చిరుతలు కనిపిస్తున్నాయి చిరుతలు. వరుస ఘటనలతో భయాందోళనకు అటు రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులు, వేదిక్ యూనివర్సిటీ, ఎస్వీ యూనివర్సిటీ, అగ్రికల్చర్ కాలేజీ, వెటర్నరీ యూనివర్సిటీ, స్విమ్స్ డాక్టర్లు, విద్యార్థులు, పరిశోధకులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ఎట్టకేలకు మగ చిరుత పులి దొరికింది. ఆడ చిరుత పులి దాని పిల్లల సమాచారం కనిపెట్టేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

'స్త్రీశక్తి' రైట్‌రైట్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'స్త్రీ శక్తి' పథకం ప్రారంభించి ముచ్చటగా మూడు రోజులయ్యింది.. గతంలో రోజుకు 35-40వేల మంది మహిళలు ప్రయాణించేవారు. ఎప్పుడైతే 'స్త్రీశక్తి' పథకం ప్రారంభించారో అప్పటి నుంచి ఈ సంఖ్య 60వేలకు చేరుకుంది. రోజుకు సగానికి 60వేల మందిపైనే ప్రయాణిస్తున్నారని ఆర్టీసీ ఆర్ఎం జగదీష్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. 17వ తేదీ ఆదివారం ఒక్కరోజే 61వేల మంది ప్రయాణించారు.

పథకం ప్రారంభం ఆగస్టు 15 సాయంత్రం 5 గంటలకు ప్రారంభించడంతో తిరుపతి జిల్లాలో ఆరోజు కేవలం 2వేల లోపే ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. 16వ తేదీ 38వేలు, 17వ తేదీ 61వేలు, 18 సోమవారం సాయంత్రం 6 గంటల వరకు 70వేలు ప్రయాణించినట్లు నమోదయ్యింది. ప్రయాణించే మహిళల పట్ల డ్రైవర్లు, కండక్టర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలో 'స్త్రీశక్తి' రైట్‌రైట్ అని ముందుకు పోతుంది. అంతరాష్ట్ర సర్వీసుల మధ్య అనుమతి ఇవ్వాలని (ఎక్స్‌ప్రెస్‌ల్లో) మహిళా ప్రయాణికుల నుంచి డిమాండ్ రావడంతో ఈ విషయమై చర్చలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఆధార్ కార్డు కాకుండా, త్వరలోనే ఈ ఉచితానికి సంబంధించి మహిళలకు ప్రత్యేకించి 'స్మార్ట్‌కార్డు' ఇచ్చే అవకాశం ఉందని చర్చ నడుస్తోంది. ఒరిజినల్ ఆధార్‌కార్డు లేకపోయినా, సెల్‌ఫోన్‌లో గానీ, జిరాక్స్ చూపించినా ప్రయాణానికి అర్హులని ఆర్ఎం జగదీష్ తెలిపారు.

తిరుమలకు ఉచిత ప్రయాణం కల్పించాలి : ఐద్వా

ఉచిత ప్రయాణం నేపథ్యంలో తిరుమలకూ మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణం కల్పించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి వినతిపత్రం ఇచ్చారు. తిరుమలకు వెళ్లే సప్తగిరి బస్సుల్లోనే ఈ పథకం వర్తించేలా చూడాలని కోరారు. పక్క రాష్ట్రాల్లో ఏ బస్సు అయినా ఎక్కొచ్చు, ఎక్కడైనా దిగొచ్చు అని ఉంటే మన రాష్ట్రంలో నాన్‌స్టాప్ బస్సులు ఎక్కకూడదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ఘాట్‌లో సాధ్యం కాదు : సంధ్యారాణి, మంత్రి

తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లేఆర్టీసీ బస్సుల్లో 'స్త్రీ శక్తి' పథకాన్ని అమలుచేయకపోవడానికి గల కారణాలను మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. తిరుమలకు ఫ్రీ బస్సు పెడితే జనం ఎక్కువగా ఎక్కుతారని, కొండపై ఎక్కువమందితో బస్సులు నడపడం ప్రమాదకరం అని చెప్పారు. ఘాట్‌రోడ్డులో పరిమిత సంఖ్యలోనే వెళ్లాలని, అదుపు తప్పే అవకాశం ఉంటుందని చెప్పారు.కొండపైకి వెళ్లాక అక్కడ ఫ్రీ బస్సు సౌకర్యం ఉందని గుర్తు చేశారు.

మాటమాత్రం చెప్పకుండా..

గ్రామసభ జరపకుండా..'తుడా' కోసం భూసేకరణ / తిరగబడ్డ చింతలపాలెం రైతులు



తిరుపతి ఎంఆర్‌ఓ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పరిశ్రమలు..పట్టణాభివృద్ధి..ఉపాధి కల్పనకు భూములు అవసరమే. కానీ వాటి ఏర్పాటుకు రైతుల నుంచి భూములు తీసుకోవాల్సి వచ్చినప్పుడు వారి అంతరంగాన్ని ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ముందే తెలుసుకోవాలి. రైతులతో చర్చించాలి. గ్రామసభలు నిర్వహించాలి. వారిలో ఆందోళనలు తొలగించాలి. వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలి. ఇవేమీ లేకుండానే.. మాటమాత్రమైనా చెప్పకుండానే తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చింతలపాలెం ప్రాంతంలో తుడా అభివృద్ధి కోసం అధికారులు భూసేకరణ చేపట్టేశారు. మూడు కార్లు పండే పచ్చని పొలాలను తుడాకు అప్పనంగా అప్పగించేందుకు సిద్ధమైపోయారు. ఓ ప్రజా ప్రతినిధి కనుసన్నల్లో ఇదంతా జరిగిపోతోంది. ఆదిలోనే విషయం తెలుసుకున్న చింతలపాలెం గ్రామస్తులు అధికారులపై తిరగబడ్డారు.

'తుడా' లాభాల వేట!

చింతలపాలెం రెవెన్యూ సర్వే నంబర్ 10, 13, 322, 323లలో 25 మంది రైతుల నుంచి సుమారు 100 ఎకరాల భూమిని తుడా కోసం సేకరించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. చింతలపాలెంలోనే తుడా కోసం సేకరిస్తున్న లే అవుట్ ఎదురుగా డీఆర్డీఏ భవనాలు నిర్మిస్తుండటం, సమీపంలోనే టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన 400 ఎకరాల భూములు ఉండడంతో తుడా కన్ను పడింది. ఈ ప్రాంతాన్ని ప్లాట్లు వేసి అమ్మేస్తే భారీగా ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నది తుడా లక్ష్యం కావచ్చు. పైగా తిరుపతి ప్రాంతంలో భూములు లేకపోవడం, ఏర్పేడు మండలం తుడా లే-అవుట్లకు అనుకూలంగా ఉండడంతో అధికారులు చాప కింద నీరులా భూసేకరణకు దిగుతున్నారు. ఇటీవల తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చి స్థానిక ఎమ్మెల్యేతో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఆ చర్చల సారాంశం చింతలపాలెం భూసేకరణ కూడా ఒకటని చర్చించుకుంటున్నారు. భవిష్యత్తులో మరిన్ని తుడా లే-అవుట్లు శ్రీకాళహస్తి ప్రాంతంలో పురుడు పోసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. అయితే తుడా లాభాల కోసం భూమిని నమ్ముకున్న రైతుల పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఈ భూమే ఆధారం: గుర్రం వెంకటేష్, రైతు చింతలపాలెం



మాది నిరు పేద కుటుంబం. తాతల కాలం నుంచి సంక్రమించిన 1.50 ఎకరాల ప్రభుత్వ భూమిలో మూడు కార్లు పంటలు పండించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇప్పుడు చెప్పా పెట్టకుండా భూమిని లాక్కోవాలని చూస్తున్నారు. రోడ్డున పడేయాలని చూస్తున్నారు.

దండోరాతో తెలిసింది: ముని కష్టయ్య, రైతు చింతలపాలెం



మా భూమిలో అన్ని పంటలు పండుతాయి. సాగునీటి సౌకర్యం ఉంది. మా భూములను తుడా వారు తీసుకుంటున్న సంగతి ఎవరికీ తెలియదు. ఆదివారం రాత్రి దండోరా వేయడంతో విషయం తెలిసొచ్చింది. బంగారం పండే భూములను ప్లాట్ల కోసం లాక్కోవడం అన్యాయం.

వీసీ ఆదేశాల మేరకే: భార్గవ రెడ్డి, తహశీల్దార్, ఏర్పేడు మండలం

చింతలపాలెంలోని పలు సర్వే నెంబర్లలో తుడాకు అనుకూలమైన భూమిని గుర్తించాలని వీసీ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు రైతులు తమ వద్ద ఉన్న పాసుపుస్తకాలు, ఆధారాలు చూపెట్టాలని దండోరా వేయించాం. భూ సేకరణ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉంది. అభిప్రాయాలను ఉన్నతాధికారులకు పంపుతాం.

బలవంతపు భూసేకరణ దుర్మార్గం

వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

తుడా అభివృద్ధి కోసం భూములు ఇచ్చేదే లేదని చింతలపాలెం రైతులు తెగేసి చెప్పారు. ఏర్పేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సిపిఎం నేతలతో కలసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ రైతులకు ఇష్టం లేకుండా.. మాటమాత్రమైన చెప్పకుండా రెవెన్యూ అధికారులు బలవంతపు భూసేకరణ చేయడం దుర్మార్గమని అన్నారు. తుడా లాభాల కోసం రైతుల జీవితాలు పణంగా పెట్టొద్దని.. రోడ్లపైకి లాగొద్దని సూచించారు. గతంలో పరిశ్రమల కోసం.. ప్రభుత్వ అవసరాల కోసం భూమిలిచ్చిన రైతుల పరిస్థితి నేడు ఎలా ఉందో చెప్పక్కర్లేదని అన్నారు. ఇంటికో ప్రభుత్వ ఉద్యోగం.. పరిహారంగా అంతే భూమిని మరో చోట ఇస్తామంటే ఆలోచిస్తామని స్పష్టం చేశారు. బలవంతపు భూసేకరణకు ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.



వైద్యులతో సమావేశమైన కమిషనర్

వైద్యులు మార్గదర్శకులు కావాలి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 లో బంగారు కుటుంబాలకు వైద్యులు అందరూ మార్గదర్శకులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య వైద్యులకు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆప్నా నిర్వహించిన సి.ఎం.ఈ. కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు లేని సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసం పి4 ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. వైద్యో నారాయణ హరి అన్న నానుడిని నిజం చేస్తూ వైద్యులు అనేక సేవలు అందిస్తున్నారని అన్నారు. అదే విధంగా వైద్యులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు అండగా నిలిచి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. ఇందుకు స్పందించిన వైద్యులు బంగారు కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నగర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఆర్.రెడ్డి, ఆప్నా అధ్యక్షులు డాక్టర్ రవి రాజు, డాక్టర్ వెంగమ్మ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ జనార్దన్, డాక్టర్ ఆశాలత, డాక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఏడాదవుతోంది..చిరువ్యాపారులకు న్యాయం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆగస్టు 21వ తేదీ గురువారం నాటికి శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు చేపట్టిన నిరసన దీక్షకు ఏడాది పూర్తవుతుందని, ఇకనైనా వారికి న్యాయం చేయాలని సంఘం గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. సోమవారం యశోదానగర్‌లోని సిఐటియు కార్యాలయంలో శ్రీవారి మెట్టు చిరువ్యాపారుల సర్వసభ్య సమావేశం జరిగింది. కందారపు మురళి మాట్లాడుతూ భక్తులను నమ్ముకుని గత పాతికేళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్న వారిని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శ్రీవారి మెట్టుమార్గం నిషేధం విధించారన్నారు. ఈ పోరాటానికి మూడు రోజుల్లో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా చిరువ్యాపారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 21న గురువారం యూనియన్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి మధు, చిరంజీవి, రాంబాబు, ప్రకాష్, మల్లికార్జున్, రామ్మూర్తి, గణేష్, సోను, మునెయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సింహాచలకండ్రిగ అటవీ భూములపై టిడిపి కన్ను : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

శ్రీకాళహస్తి మండలం సింహాచలకండ్రిగలోని 125ఎకరాల రక్షిత అటవీ భూమిని టిడిపి ప్రజాప్రతినిధి కొల్లగొట్టే ప్రయత్నాలను ఎంపి గురుమూర్తి ఖండించారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని భారీ ఎత్తున అటవీ భూమిని సొంతం చేసుకునే ప్రయత్నాలను సంబంధిత అధికారులు అడ్డుకోవాలని డిమాండ్‌చేశారు. అటవీ భూములు రక్షించేందుకు కేంద్రం కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తుంటే, మరోపక్క టిడిపి నాయకులు కోట్లాది రూపాయల భూములను కొల్లగొట్టడం దుర్మార్గమన్నారు. రక్షిత అటవీ భూములను కాపాడాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

శేషాచలంలో అరుదైన జంతువులను పరిరక్షించాలి

శేషాచల జీవవైవిధ్య అభయారణ్యంలో అంతరించిపోతున్న మూషిక జింక, బంగారుబల్లి, దేవాంగపిల్లి, రంగుల ఉడత, పసుపు గొంతు పిగిలి పిట్ట వంటి అరుదైన జంతుజాతుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందని తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి పార్లమెంట్‌లో అడిగారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ మాట్లాడుతూ వన్యప్రాణుల నివాసాల అభివృద్ధి పథకం కింద ఆర్థిక సాయం అందుతుందన్నారు. అటవీ భూముల వినియోగం కారణంగా కలిగే నష్టాన్ని తగ్గించేందుకు 'కాంపా' చట్టం కింద నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. 2024-26 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.121.63 కోట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధారిటీకి మంజూరు చేశామని పేర్కొన్నారు.

అక్రమ ఆర్ఎంపి క్లినిక్ సీజ్



ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మండలం ఆవులనత్తంలోని ఆర్ఎంపి క్లినిక్‌లో డిప్యూటీ డిఎంహెచ్ఓ గంగాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుభాష్ రాజా, వైద్యసిబ్బంది సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం నాట్రంపల్లికి చెందిన వడివేలు సరైన సర్టిఫికెట్స్ లేకుండా ఆర్ఎంపి క్లినిక్ నిర్వహిస్తూ వైద్యం చేస్తున్నారని ఫిర్యాదుల నేపథ్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్ఎంపి క్లినిక్‌లో రెండు బెడ్స్ వేసుకొని వైద్యం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తెలిసీ తెలియని వైద్యంతో గ్రామీణుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారని దీంతో ఆర్ఎంపి క్లినిక్‌ను సీజ్ చేసినట్లు డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ గంగాదేవి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌ల పేరుతో వైద్యం అందిస్తున్నట్లు తెలిస్తే కఠినచర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కుప్పం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా వెలసిన క్లినిక్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏఎస్ఎం కాంప్లెక్సులో దుకాణాలు సీజ్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరులోని నగరపాలక సంస్థ ఏఎస్ఎం కాంప్లెక్సులో రెండు దుకాణాలకు నగరపాలక రెవెన్యూ అధికారులు సీజ్ వేశారు. నగర పాలక సంస్థకు చెందిన పలు దుకాణాల్లో దీర్ఘకాలికంగా అద్దె బకాయిలు పెండింగ్ ఉన్న దుకాణాలకు సంబంధించి కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు.. సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సోమవారం ఏఎస్ఎం కాంప్లెక్సులో తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాలకు నోటీసులు ఇవ్వగా.. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న రెండు దుకాణాలను సీజ్ చేశారు. నగరంలోని నగరపాలక సంస్థకు చెందిన అద్దె దుకాణాల సంబంధించి అద్దె బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించాలని, పెండింగ్ ఉన్న వాటిని సీజ్ చేస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్వో గోపాలకృష్ణ వర్మ, ఆర్ఐ అమరనాథ్ రెడ్డి, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

భార్యను చంపిన కేసులో భర్త అరెస్ట్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: భార్యను చంపిన కేసులో భర్త అరెస్ట్ చేసినట్టు సిఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోదల మడుగు గ్రామంలో శనివారం జరిగిన ప్రియాంక హత్య ఘటనలో ఆమె భర్త హరిబాబు తన భార్య ప్రియాంకకు వివాహేతర సంబంధం ఉన్న నేపథ్యంతో గొంతు కోసి హత్య చేశాడని, దీనిపై సోమవారం మండలంలోని మొగిలి గ్రామం వద్ద హరిబాబు ఉండగా అతన్ని అరెస్టు చేసి అదుపులో తీసుకున్నామని, కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినటు తెలిపారు. కేసు దర్యాప్తులో ఎస్సై ప్రసాద్ ట్రైన్ ఎస్సై అనిల్ కుమార్ నాయక్, కానిస్టేబుల్ నీరజాక్షలు కిరణ్ ద్వారకనాథ్ ప్రతిభకనబరిచారని తెలిపారు.

సోమలలో జనసేన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి- సోమల

మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలిలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ జనసేన జెండా ఆవిష్కరించారు. జనసేన జెండాగర్జన కార్యక్రమంలో భాగంగా సూరయ్యగారిపల్లె బస్టాండ్, సోమల బస్టాండ్ కూడలిలో జెండాను ఆవిష్కరించారు.

దారి దోపిడీ దొంగలు అరెస్ట్

రూ.2 లక్షల విలువైన సొత్తులు స్వాధీనం

ప్రజాశక్తి- విజయపురం (నగరి)



ముద్దాయిలను చూపుతున్న నగరి పోలీసులు

నగరి పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండు నెలలుగా, మోటార్ సైకిల్‌లో ఒంటరిగా వెళ్తున్న వృద్ధులను టార్గెట్ చేసి వారి వద్ద నగదు, మొబైలు ఫోన్లులు బలవంతంగా తీసుకోవడం, నగదు ఇవ్వకుంటే వారిపై దాడి చేసి గాయపరచడం లాంటివి చేస్తూ వచ్చిన దారి దోపిడీ దొంగలు పి.సతీష్ (19), ఆర్.శంకర్ (అజిత్) (20), ఎంఎస్.విజయకుమార్ (20)లను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సీఐ విక్రమ్ కథనం మేరకు.. దారి దోపిడీ సంఘటనలపై గత 2 నెలల్లో నగరి పోలీస్ స్టేషన్ మూడు కేసులు నమోదు చేయడం జరిగిందని, వీటిని నివారించేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పర్యవేక్షణలో ప్రత్యేక టీంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా సోమవారం అందిన సమాచారం మేరకు, ఇన్‌స్పెక్టర్‌తో పాటు, నగరి ఎస్ఐ విజయ నాయక్, ట్రైనీ ఎస్ఐ మారెప్ప, సిబ్బందితో వెళ్లి నగరి- తిరుత్తణి మెయిన్ రోడ్డు కీళపట్టు ఆంజనేయ స్వామిగుడి వద్ద మోటార్ సైకిల్‌పై వస్తున్న నిందితులు నగరి కాలనీకి చెందిన సతీష్, వేలావడికి చెందిన శంకర్ అలియాస్, కరకంఠాపురం కాలనీకి చెందిన విజయ్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారిని విచారించగా పలు చోరీల్లో వారు ముద్దాయిలుగా తేలిందని, నగరి కాలనీకి చెందిన సతీష్ ఒక్కో నేరానికి ఒక్కో ముఠాను సిద్ధం చేసుకొని నేరాలను కొనసాగిస్తున్నట్లు తెలియవచ్చిందని అన్నారు. గత ఏడాది నగరి వీకెయస్ లే అవుట్‌లో ఒక నివాస గృహంలో ల్యాప్టాప్, టివి, ఫ్యాన్, గ్యాస్ సిలిండర్, బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులోను, నగరి కశింమిట్ట మునీశ్వర స్వామిగుడి హుండీ చోరీ కేసులోను, గత నెల అర్థరాత్రి వృద్ధుని అడ్డగించి రూ.35 వేలు చోరీ చేసిన కేసులోను, వడమాలపేట పూడి రైల్వేస్టేషన్ వద్ద బైక్ చోరీ కేసులోను, నగరి మండలం నాగరాజకుప్పం వద్ద బైక్‌పై వెళుతున్న వృద్ధుని అడ్డగించి బైక్, సెల్ పోన్ దోచుకున్న కేసులోను, కేజీ కుప్పం వెళ్లే మార్గంలో బైక్‌లో వెళుతున్న వ్యక్తిని అడ్డగించి డబ్బులు ఇవ్వలేదని బీర్ బాటిల్‌తో తలపగలగొట్టిన కేసులోను వీరే ముద్దాయిలుగా తేలింది. వీరి వద్ద నుంచి ల్యాప్టాప్, ఫ్యాన్, గ్యాస్ సిలిండర్, బైకు, నోకియా సెల్‌ఫోన్, రూ.37, 570లు నగదు అంటూ రూ.2లక్షల మేర సొత్తును స్వాధీనం చేసుకొని ముద్దాయిలను రిమాండ్‌కు తరలించారు. ముద్దాయిలుగా ఉన్నవారిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులు లోకనాథం, ఇంద్ర కుమార్, గజేంద్ర, సురేష్, నవీన్, సత్య, గోపి, రవి, కదిర్ వేలుకు డీఎస్పీ ప్రసంశలు అందజేశారు.

జంతువుల కోసం అడవి చుట్టూ విద్యుత్ కంచె

కిలోమీటర్ మేర ఇనుప తీగలు వేసిన వేటగాళ్లు

సకాలంలో గుర్తించి తొలగించిన రైతులు

గుర్తించని విద్యుత్ శాఖ తీరుపై రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న జగనన్న లేఅవుట్ సమీపంలోని అడవి జంతువుల కోసం అటవీ ప్రాంతం చుట్టూ వేటగాళ్లు ఏకంగా కిలోమీటర్‌కు పైగా ఇనుప తీగలను ఏర్పాటు చేసిన సంఘటన సోమలలో సోమవారం వెలుగు చూసింది. రాత్రి వేళల్లో తాగునీటి కోసం వ్యవసాయ పొలాల వద్దకు వచ్చే అడవి జంతువుల కోసం విద్యుత్ సరఫరా ఇచ్చి మృతి చెందిన వాటిని ఉదయాన్నే అక్కడి నుండి వేటగాళ్లు తరలించి వేల రూపాలయకు వాటిని అమ్ముకుంటున్నారు. సోమవారం ఉదయం రైతులు విషయాన్ని గుర్తించి ఇనుప కంచె కోసం ఏర్పాటు చేసిన గూటాలను ఇనుప కమ్మిని మొత్తం విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఉంచి సమస్యను వారికి తెలియజేశారు. రాత్రి వేళల్లో పంట పొలాలకు నీరు పెట్టేందుకు రైతులు పొలాల వద్దకు వెళుతుంటారని అలాంటి సమయంలో ఇనుపకంచెకు వేటగాళ్లు విద్యుత్ సరఫరా ఇస్తే పొరపాటున విద్యుత్ కంచెకు రైతులు, ఆవులు, మేకలు గొర్రెలు తగిలితే కరెంట్ షాక్‌కు గురై మరణించే అవకాశం ఉందని, సబ్‌స్టేషన్ సమీపంలోనే ఇంత జరుగుతున్నా విద్యుత్తు శాఖ అధికారులు గుర్తించకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేటగాళ్లను గుర్తించి ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించాలని, ఇకపై నోరులేని అడవి జంతువుల కోసం ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు విద్యుత్ శాఖను డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఎవరూ స్థానికంగా లేకపోవడం కారణంగా కూడా వేటగాళ్లు పెట్రేగిపోతున్నారు. సిబ్బంది కొరత కూడా విద్యుత్ శాఖను వేధిస్తూ ఉండడంతో రాత్రి వేళల్లో పర్యవేక్షణ చేయలేక పోతున్నారు. విధులు నిర్వర్తిస్తున్న వారు అధిక పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారు. ఏది ఏమైనా మండలంలో ఇప్పటికే ఎన్నోసార్లు అక్రమ విద్యుత్ కంచెలకు మనుషులు తగిలి మృతిచెందిన సంఘటనలు జరిగాయి. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయిలో విద్యుత్‌శాఖ వారు పర్యవేక్షణ చేసి అడవి జంతువులను, మనుషుల ప్రాణాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద రైతులు తెచ్చిపెట్టిన ఇనుప వైర్లు

పీడీ యాక్ట్ కింద కేసు నమోదు : సిఐ

ప్రజాశక్తి- పుంగనూరు: మండలంలోని చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన శ్రీరాములు కుమారుడు కొర్రు వెంకటరమణ (34)పై పిడి యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులకు వివరాలు తెలిపారు. కొర్రు వెంకటరమణ అనే వ్యక్తి మార్చి 15న కృష్ణాపురంలో జరిగిన రామకృష్ణ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని ప్రస్తుతం బెయిల్ పై ఉన్నాడని తెలిపారు. గతంలో ఇతను రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు కొర్రు వెంకటరమణపై పిడి యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఆదివారం అదుపులోకి తీసుకొని కడప సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. అక్రమ మద్యం వ్యాపారాలు, బందిపోటు, మాదకద్రవ్యాల విక్రయం, గుండాగిరి, వ్యభిచారం, భూ కబ్జాదారులు ప్రమాద కార్యకలాపాలు జరిపే వారిపై పిడి యాక్ట్ కేసు నమోదు చేస్తామన్నారు.

కుప్పంలో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మున్సిపాలిటీ తంబిగానిపల్లికి చెందిన సింగారవేలు భార్య దుర్గ (27) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గిడ్డేగాని పెంటకు చెందిన దుర్గకు ఏడేళ్ల క్రితం సింగార వేలుతో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. దుర్గ తరచూ కడుపు నొప్పితో ఆసుపత్రికి వెళ్ళొచ్చేది. ఈ నేపథ్యంలో సోమవారం దుర్గ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే గురించి కుప్పంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ దుర్గ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కడుపునొప్పి తట్టుకోలేక దుర్గ ఆత్మహత్య చేసుకుని ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. దుర్గ ఆత్మహత్యతో పిల్లలు అనాథలు అయ్యారంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ మేరకు కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

In the Court of the Principal Senior Civil Judge Tirupati
O.S.No. 355/2016

BETWEEN
Vattam Ramachandra Reddy ...Petitionier/Plaintiff
AND
K. Munirathnam (died) and others ...Respondents/ Defendants

SUMMONS TO THE DEFENDANTS No. 3 to 7

To, **3**. K. Sekhar, S/o Late K. Munirathanam
4. M. Lavanya, D/o Late K. Munirathanam
5. Mounidevi, D/o Late K. Munirathanam
6. Muni Lakshmi, D/o Late K. Munirathanam
7. Yashoda, D/o Late K. Munirathanam
No.3 to 7 are residing at Naravaripalli, Seshapuram Post, Chandragiri mandal, Tirupati district.

Plaintiff filed a suit against the Defendants for Recovery of the suit Amount of Rs. 7,74,000/- with interest the petitioner / Plaintiff has taken steps to Service notice of Summouns to Respondent Defendants No. 3 to 7 to attend before the Hon'ble court on 26-08-2025 at 10.30A.M either directly or through your counsel failling which the matter will be Decided Exparte.

Hearing Date : 26-08-2025

N. MANOHAR,
ADVOCATE, TIRUPATI.
PH No. 9346981333

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, తిరుపతి
O.S. No. 16 / 2023

T. Sobha ...Plaintiff
Vs
K. Sireesha and others ...Defendants

1వ ప్రతివాదికి నోటీసు

To
K. Sireesha, W/o A. Rakesh Kumar Reddy, D.No.19-4-8-/P405, Saradhi Shelters, S.T.V. Nagar, Tirupati.

పై దావాలో మీ యొక్క హాజరుకు గాను 25-08-2025 వ తేదిన పై కోర్టులో వాయిదా వున్నది. ఆ దినం ఉదయం 10.30గం॥లకు మీరు గాని మీ తరపు వకీలు గాని, పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
రాయపనేని గజేంద్ర, బి.కాం, బి.ఎల్,
పి. సుజాత,
డి.వి.ఎల్. డిల్లీ బాబు,
న్యాయవాదులు, తిరుపతి.

సర్వే పారదర్శకంగా నిర్వహించకుంటే క్రమశిక్షణ చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

తోతాపురి మామిడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునే విధంగా రూ.4.లను సబ్సిడీ రూపంలో మామిడి రైతులకు అందించనున్న నేపథ్యంలో ఆర్థిక సహాయం దుర్వినియోగం కాకుండా రైతులు సరైన విధానంలో అందేలా మండల అగ్రికల్చర్, హార్టికల్చర్, పట్టు పరిశ్రమ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నుండి మామిడి రైతులకు అందించాల్సిన సబ్సిడీపై మండల అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి రైతుల నుండి గుజ్జు పరిశ్రమలకు అందించడం జరిగిందని, జిల్లాలో ఇప్పటివరకు సేకరించిన మామిడికి రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న రూ.4లు సబ్సిడీ మొత్తం రూ.130 కోట్లు రైతులు ఖాతాలకు జమచేయడం జరుగుతుందని తెలిపారు. తోతాపురి మామిడి రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న సబ్సిడీ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉందని తెలిపారు. జూన్ నెల వరకు సేకరించిన మామిడికి సంబంధించి సబ్సిడీ జూలై నెలలో అలాగే జూలై నెలలో సేకరిస్తున్న మామిడికి సంబందించి సబ్సిడీ ఆగస్టు నెలలో రైతులు ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి బృందం ఎంఏఓ, హెచ్ఓ సంబంధిత అధికారులు మామిడి డేటా పరిశీలన ఎలాంటి తప్పులు లేకుండా డేటా ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటివరకు మొత్తం 81,455 మంది రైతుల నుండి 3,75,383 మెట్రిక్ టన్నుల మామిడి పంట మామిడి పంట సేకరించబడిందని, ఇందులో పల్ప్ యూనిట్ల ద్వారా 49,535 మంది రైతుల నుండి 2,30,518 మెట్రిక్ టన్నులు సేకరించబడ్డాయన్నారు. ర్యాంపులు, మండీల ద్వారా 31,920 మంది రైతుల నుండి 1,44,865 మెట్రిక్ టన్నులు సేకరించబడ్డాయని, ఇంకా 2402 ఎంట్రీలు (11651 మెట్రిక్ టన్నులు) ఇతర ఆర్ఎస్కెలు, ఇతర మండలాలకు సంబంధించినవి పెండింగ్‌లో ఉన్నాయని, తుది ఆర్ఎస్కె వారీగా, మండల వారీగా హార్డ్ కాపీలను ఈనెల 20వ తేదీ లోపు సంబంధిత ఆర్ఎస్కె ఇన్‌చార్జీలు, మండల బృందానికి అందజేయాలని పేర్కొన్నారు. సంతకాలు చేసిన కాపీలను ఈనెల 23వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు. అన్ని వివరాలను రికార్డు చేయాలని, ఇందులో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. వ్యవసాయ శాఖ జోడి మురళీకృష్ణ, ఆర్టికల్చర్ అధికారి మధుసూదన్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారి పరమేశ్వరన్, సెరికల్చర్ జెడి పద్మావతమ్మ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

టిడిపి బలోపేతమే ధ్యేయం

మండల పార్టీ అధ్యక్షులు బాబు నాయుడు



ముఖ్యమంత్రి చంద్రబాబుతో బాబు నాయుడు

ప్రజాశక్తి- గుడిపల్లి: కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ మండలంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడమే తన ధ్యేయమని టిడిపి మండలాధ్యక్షులు టీఎం.బాబునాయుడు తెలిపారు. గుడిపల్లి మండలం సోడిగానిపల్లి గ్రామపంచాయతీకి చెందిన టిఎం.బాబునాయుడు కుప్పం నియోజకవర్గ జనరల్ సెక్రటరీగా రెండుసార్లు, జిల్లా యువత ఉపాధ్యక్షులుగా రెండుసార్లు, రాష్ట్ర యువత ఆర్గనైజింగ్ సెక్రటరీగా రెండుసార్లు పనిచేసి టిడిపి అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేసిన కృషికి గుర్తించి పార్టీలో వివిధ హోదాలు కల్పించారని, మండలంలో సామాజిక సేవలు చేస్తూ మండల ప్రజలకు సుపరిచితుడిని అయ్యాయని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో గుడిపల్లి మండల సింగల్ విండో వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహించి రైతులకు అండగా ఉంటూ వారిని అన్ని విధాలుగా ఆదుకున్నానని తెలిపారు. అదేవిధంగా కరోనా క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు ఎన్టీఆర్ ట్రస్ట్, తన సొంత నిధులతో ప్రజలకు ఆహారం, మందులు పంపిణీ చేసి ఆదుకున్నట్లు గుర్తు చేశారు. మానవసేవే మాధవ సేవగా భావించి కరోనాకాలంలో ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. తన సేవలను గుర్తించిన తెలుగుదేశం అధిష్టానం గుడిపల్లి మండల అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించారని, దీనితో తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. మండలంలోని 18 గ్రామపంచాయతీలో టిడిపి బలోపేతానికి అంకితభావంతో తన వంతు కృషి చేస్తానని, పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేస్తూ కార్యకర్తలను కలుపుకుని పనిచేస్తానని తెలిపారు.





కరోనా సమయంలో పలు సేవా కార్యక్రమాల్లో..

మనోహర్ మృతి బాధాకరం

నివాళి అర్పించిన సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కామ్రేడ్ భువనేశ్వరి భర్త మనోహర్ రెడ్డి సోమవారం అనారోగ్యంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మృతిపట్ల సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు విచారం వ్యక్తం చేస్తూ ఆయన మృతి బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన మృతదేహాన్ని గంగరాజుతోపాటు జిల్లా కమిటీ సభ్యులు ఓబుల్ రాజు సందర్శించి నివాళులర్పించి భువనేశ్వరికి వారి సానుభూతి తెలియజేశారు.



దివ్యాంగులకు రూ.1.5 కోట్ల ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి- కుప్పం: అలిన్కో సంస్థ ఆధ్వర్యంలో కుప్పం మండల పరిధిలోని దివ్యాంగులకు రూ.1.5కోట్ల విలువైన ఉపకరణాలు పంపిణీ చేశారు. సోమవారం కుప్పం పట్టణం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్, వీల్ చైర్, స్క్రీన్ రీడింగ్ సాఫ్ట్‌వేర్‌తో కూడిన స్మార్ట్ ఫోన్, వాకింగ్ స్టిక్, ట్రై సైకిల్లను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, అలిన్కో సంస్థ ప్రతినిధులు అందజేశారు. సీఎం చంద్రబాబు కృషితో దివ్యాంగులకు పరికరాలు అందజేసినట్లు ఎమ్మెల్సీ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, కౌన్సిలర్లు జిమ్ దాము జాకీర్, సోము, తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ అసిస్టెంట్‌కు సత్కారం

ప్రజాశక్తి- కుప్పం



79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకున్న కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ నాయుడును కార్యాలయ ఉద్యోగులు సోమవారం ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో సీనియర్ అసిస్టెంట్ భాస్కర్ నాయుడు నిరంతరం తనకు అన్ని విధాలుగా అందుబాటులో ఉన్నారని, ఆయన సేవలను గుర్తించి ఉత్తమ ఉద్యోగి అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ పేర్కొన్నారు. తనకు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు రావడానికి ఎంతగానో సహకరించిన జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణ మూర్తి, సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బందికి భాస్కర్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది, దస్తా వేజ్, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి అన్ని విధాలాగా కృషి చేస్తా: ఎమ్మెల్యే థామస్



ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం స్కంద పుష్కరిణి కుమారగిరిపై వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. సోమవారం స్వామివారి దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయంకు కావలసిన సౌకర్యాలు తప్పకుండా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువతో సన్మానించారు. అలాగే రాజశేఖర్, రవి యాదవ్, రాధాకృష్ణ,సెల్వి, హేమంత్ రెడ్డి శాలువ కప్పి సన్మానించారు.



పాఠశాలకు టేబుల్‌ను వితరణ చేస్తున్న గజేంద్రవర్మ

టేబుల్ వితరణ

ప్రజాశక్తి- విజయపురం: విజయపురం మండలం శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు పూర్వవిద్యార్థి మాజీ సైనికులు కొండూరు గజేంద్రవర్మ సోమవారం ఆఫీస్ టేబుల్‌ను వితరణగా ప్రధానోపాధ్యాయులు వెంకమరాజుకు అందించారు. ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు మాట్లాడుతూ సైనికునిగా దేశానికి సేవలు అందించి, చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు అయిన గజేంద్ర వర్మ విద్యార్థులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ చిన్న పాపయ్య, విశ్రాంత ఎంఈవో జయదేవరాజు, ఉపాధ్యాయులు సూరలక్ష్మి, సురేష్ గ్రామస్తులు ఎరుకలయ్య, సురేష్, చెంచురాజు, నరేష్, జయరామరాజు పాల్గొన్నారు.

చిన్న ముత్తయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి మండల ఆర్‌టిఐ జనరల్ సెక్రటరీ నవీన్ కుమార్ తండ్రి, చిన్న ముత్తయ్య మృతి చెందారని తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, నియోజక వర్గ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మిలు నవీన్ కుటుంబ సభ్యులను సోమవారం ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం వైద్య విభాగ అధ్యక్షులు డాక్టర్ కోలారు ప్రకాష్ మాట్లాడుతూ వైసిపి ఎల్లవేళలా తోడుగా ఉంటుందని ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి తెలిపారన్నారు.



మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని సన్మానిస్తున్న అర్చకులు

ఆలయ పునర్నిర్మాణానికి పూజలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: . పెనుమూరు మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పులిగుండు వద్ద వున్న పులిగుండేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం నిర్వహిస్తున్నారు. దాదాపు ఐదు కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో బాలాలయ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి , మాజీ ఎంపీ మహాసముద్రం జ్ఞానేంద్ర రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు రాకేష్‌రెడ్డి, ఎంపీపీ హేమలతా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కామసాని విజయ్ కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహాసముద్రం సురేష్ రెడ్డి, దూది మోహన్, మధుసూదన్ రెడ్డి, చంద్రారెడ్డి, ఉమాపతి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా పింఛన్లు తొలగించారు..

కలెక్టరేట్ ఎదుట వికలాంగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వికలాంగులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల రీ-అసెస్మెంట్ ప్రక్రియలో భోగస్ పింఛన్ల ఏరివేత పేరుతో వైద్యుల బృందం చేసినటువంటి వైకల్య నిర్ధారణలో నిజమైన వికలాంగులకు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పింఛన్లు నిలుపుదల చేస్తున్నట్లు వికలాంగులకు నోటీసులు అందించడంతో ఖంగుతిన్న అర్హులైన వికలాంగులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చిత్తూరు కలెక్టరేట్‌లో ఎదుట చిత్తూరు జిల్లా వికలాంగుల జేఏసీ ఆధ్వర్యంలో బాధిత వికలాంగులతో కలిసి ధర్నా చేశారు. ధర్నా కార్యక్రమంలో జేఏసీ నేతలు, కలెక్టర్ బయటకు రావాలని, తొలగించిన అర్హుల పింఛన్లు పునరుద్ధరించాలని, అర్హులైన వికలాంగుల వైకల్య పునఃపరిశీలనలో అనర్హులుగా నిర్ధారించిన సంబంధిత ప్రభుత్వ డాక్టర్లను తక్షణమే సస్పెండ్ చేయాలని, వికలాంగుల ఐక్యత వర్ధిల్లాలి అని భారీఎత్తున నినాదాలు చేశారు. సుమారు గంట సేపు తర్వాత కలెక్టర్ ధర్నా కార్యక్రమం వద్దకు వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వికలాంగులకు సచివాలయ సిబ్బంది అందజేసిన పింఛన్ల తొలగింపునకు సంబంధించిన నోటీసులను స్వయంగా పరిశీలించారు. పొరపాట్లు జరిగాయని, పొరపాట్లు సరిదిద్దు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కొణతం చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి కలెక్టర్‌తో మాట్లాడుతూ రూ.15,000 లు పింఛను దారులను వారి ఇంటి వద్దనే మళ్లీ రీ అసెస్మెంట్ చేయాలని, మిగిలిన వారిని యథావిధిగా రీ అసెస్మెంట్ చేయాలని, ఆగిపోయిన పింఛన్లకు ప్రభుత్వమే బాధ్యత వహిం చాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. నాయకులు సుమతి, లీలాపతి నాయుడు, మురళి గౌడ్, ఏకాంబరం, సుబ్రమణ్యం, మోహన్, చిరంజీవి, సుబ్బమ్మ, ప్రశాంతి, చెంచులక్ష్మి, 400 మందికి పైగా వికలాంగులు పాల్గొన్నారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 17 బార్లు

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ్ శేఖర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, టూరిజం ప్రాంతాలలో జిల్లాలోని 8 ప్రాంతాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నూతన బార్ పాలసీ 2025 ద్వారా 29 బార్లను ఓపెన్ క్యాటగిరి పద్ధతి ద్వారా కేటాయించాలని నిర్ణయించిందని చిత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయ శేఖర్, తిరుపతి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం తిరుపతి నగర పరిధిలోని అర్బన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఈ మేరకు విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన బార్ పాలసీ ద్వారా గత బార్ల పాలసీతో పోలిస్తే ఈ పాలసీ ద్వారా లైసెన్స్ దారుడు ఆర్థిక భారం పడకుండా ఉంటుందన్నారు. ఓపెన్ క్యాటగిరి బార్లను ఈనెల 18వ తేదీ నుండి దరఖాస్తులను స్వీకరిస్తూ 28వ తేదీ ఉదయం 8 గంటలకు కలెక్టర్ ద్వారా డ్రా విధానం అమలు చేస్తామన్నారు. అదే రోజు లైసెన్సుదారుడు పేరు కూడా ప్రకటిస్తామన్నారు. తిరుపతి జిల్లాలో గీత కులాల వారికి కూడా ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఇందులో భాగంగా తిరుపతి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి (ఈడిగ), శ్రీకాళహస్తి మున్సిపాలిటీ ఒకటి (గౌడ్), గూడూరు మున్సిపాలిటీ పరిధి ఒకటి (ఈడిగ) వారికి కేటాయించడానికి నిర్ణయించిందన్నారు. గీత కులాలకు సంబంధించిన వారికి 20వ తేదీ నుండి దరఖాస్తుల స్వీకారం ప్రారంభమై 30వ తేదీన కలెక్టర్ వారిచే డ్రా తీస్తామన్నారు. 2025 నుండి 2028 వరకు కొనసాగి ఈ నూతన బార్ పాలసీకి 2025-26కు సంబంధించి రూ.55 లక్షలు, 2026-27కు రూ.60.50 లక్షలు, 2027-28 ఆర్థిక సంవత్సరానికి రూ.66.55 లక్షల రూపాయలను చెల్లించాలన్నారు. గీత కులాల వారికి 2025-26కు రూ.27.50 లక్షలు, 2026-27కు రూ. 30.25 లక్షలు, 2027-28 ఆర్థిక సంవత్సరానికి రూ. 33.275 లక్షల రూపాయలను లైసెన్స్ ఫీజుగా చెల్లించాలన్నారు. ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా దరఖాస్తులు చేసుకోవచ్చని, ఒకటే వ్యక్తి ఎన్ని బార్లు కైనా లైసెన్సు పొందవచ్చన్నారు. లాటరీ పద్ధతి ద్వారా కేటాయింపు పడిన వెంటనే సంవత్సర లైసెన్సు ఫీజులోని 1/6 వంతు మొత్తం అదే రోజు చలానా రూపంలో చెల్లించాలన్నారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు రావాలని, అలా రాకుంటే వాటికోసం దరఖాస్తు సమయం పొడిగిస్తూ ఆ బార్‌కు సంబంధించి రీ-నోటిఫికేషన్స్ ఇస్తామన్నారు. గత బార్ల లైసెన్సుతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన బార్ లైసెన్సు పాలసీతో లైసెన్సుదారుడుకి అధిక వడ్డీ భారం తగ్గుతుందని పాలసీ వివరాలను వెల్లడించారు.



దేవాలయ నిర్మాణానికి క్రతువు

ప్రజాశక్తి- శాంతిపురం: రాళ్ళబూదుగూరులోని పురాతన శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం పూజా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం శ్రీ కోదండ రామస్వామి దేవాలయ నిర్మాణం కోసం వేదపండితులు దేవతా విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి దేవతా మూర్తులను కళాకర్షణ క్రతువులను నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గర్భగుడి నుంచి తొలగించి భద్రపరిచారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, రాష్ట్ర శాసనమండలి పొలిటికల్ చైర్మన్ కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొనగా ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం కోసం 18 నెలల లోపు పూర్తిచేసే విధంగా ఆదేశించామని, ప్రస్తుతం సుమారు రూ.7.85 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు విశ్వనాథ నాయుడు, మాజీ వైస్ ఎంపిపి ఉదయ్ కుమార్, జనార్ధన్ రెడ్డి, ఆర్ఎస్. మణి, చంద్ర, రమేష్, నాగరాజు, హరినాథ్ రెడ్డి, రెస్కో డైరెక్టర్ బసవరాజు, చలపతి, ఏఎంసి డైరెక్టర్ శ్యామలమ్మ పాల్గొన్నారు.

11 బార్లకు టెండర్లు ఆహ్వానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఓపెన్ కేటగిరీలో 11 బార్లకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ప్రొభిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ విజయశేఖర్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో 7 మున్సిపాలిటీలో ఒక్కొక్కటి చొప్పున బార్లకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రూ.15వేలు దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏడాదికి ఒక్కో బార్‌కు రూ.55లక్షలు డిపాజిట్ రూపంలో దశల వారీగా చెల్లించాలన్నారు. ఒక బార్‌ను కల్లుగీత కార్మికులకు కేటాయించడం జరిగిందన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5గంటల లోపుగా ఆన్లైన్ ఆఫ్లైన్ దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.



ఎంపీడీవో రాజేంద్ర బాలాజీకి సన్మానం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ స్వాతంత్ర దినోత్సవం రోజున మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు పొందినందుకు సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఎంపిపి ఎం.రెడ్డప్ప, డిప్యూటి తహశీల్దార్ ఎంపిడిఓకు శాలువ కప్పి సన్మానించారు. వారు మాట్లాడుతూ ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ మండల ప్రజలకు అందించిన సేవలకు గాను ఉత్తమ అవార్డును పొందటం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



ప్రజాశక్తి- ఐరాల: శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కి విరా ళంగా రూ. 1,00,000ల చెక్కును గుంటూరుకు చెందిన సిహెచ్‌వి కె.రామమూర్తి సోమవారం ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబుకు అందజేశారు. అనంతరం దాత రామమూర్తి కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థుల చేరిక

బాలుర వసతిగృహం పునఃప్రారంభం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహం 26 మంది విద్యార్థుల చేరికతో సోమవారం పునఃప్రారంభమైంది. రెండు సంవత్సరాల క్రితం బాలికల వసతి గృహం భద్రతా కారణాల దృష్ట్యా మూసివేశారు. వసతి గృహం తిరిగి ప్రారంభించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు 11 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి వసతి గృహానికి పెయింటింగ్స్, కుళాయిలు, ఎలక్ట్రికల్ పనులు, ఫ్యాన్లు ఇతర మరమ్మతు పనులు చేయించి వసతి గృహాన్ని సిద్ధం చేశారు. సోమవారం సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమ సుధాకర్ తమ పాఠశాలలోని ఆరు నుండి పదవ తరగతి చదువుతున్న 26 మంది విద్యార్థులను చేర్పించి వసతి గృహాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి వార్డెన్ రాజేష్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ వంద మందికి పైగా విద్యార్థులు వసతి గృహంలో ఉండేందుకు అవకాశం ఉందని మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు ఏ కులానికి చెందినా వసతి గృహంలో చేర్పించుకుంటామని ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం పాఠశాలలో భోజనం, సాయంత్రం స్నాక్స్ రాత్రి భోజనం, నిద్రకు ఉపక్రమించే ముందు పండ్లు అందిస్తామని తెలిపారు. దుప్పట్లు, కార్పెట్లు, ప్లేట్లు, గ్లాసులు విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. వసతి గృహాన్ని సోమల మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని వసతి గృహంలో చేరి బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు హేమ సుధాకర్ మాట్లాడుతూ వసతి గృహం తిరిగి ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది జ్యోతిశ్వరుడు, సూర్య ప్రకాష్, వసతి గృహ సిబ్బంది సునీత, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థుల చేరికతో ప్రారంభమైన సాంఘిక సంక్షేమ వసతి గృహం

అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- పిజిఆర్ఎస్‌కు 324 వినతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినుతల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన 324 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టరు జి విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్ స్వీకరించారు. మొత్తం 324 అర్జీలు అందగా ఇందులో రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించి 223, పోలీస్ శాఖ 13, పంచాయతీరాజ్ 2, విద్యాశాఖ 5, వ్యవసాయ శాఖ 5, పౌరసరఫరాల శాఖ 4 అర్జీలు అందాయి. డిఆర్‌డిఏ 25, డ్వామా 2, వయోవృద్ధుల సంక్షేమ శాఖ 14, ఉపాధి కల్పనా శాఖ 4, హార్టికల్చర్ 1, సర్వశిక్ష అభియాన్ 12, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ 2 అర్జీలు అందాయి. దేవాదాయ శాఖ 3, పశుసంవర్ధక శాఖ 4, రోడ్లు, భవనాల శాఖ 1, ఏపీఎస్ ఆర్టీసీ 1, ఎంపీడీవో బంగారుపాల్యం 1, ఎంపీడీవో యాదమరి 1, గృహనిర్మాణ శాఖ 1 అర్జీ అందాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కరుణ కుమారి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : కమిషనర్

ప్రజా ఫిర్యాదుల స్వీకరణలో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అన్నారు. నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందించిన వినతులు స్వీకరించారు. నగరపాలక పరిధిలోని పలువురు తమ సమస్యలపై వినతిలో సమర్పించగా.. సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలు


ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

పరిష్కరించాలని, పరిష్కరించిన సమస్యలపై సకాలంలో నివేదికలు అందివ్వాలన్నారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఇంజనీరింగ్ 3, రెవెన్యూ 3, హెల్త్, అకౌంట్స్, ప్లానింగ్ విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున మొత్తం 9 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు డిపోలో ఈ నెల 19వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం నిర్వహిస్తామని డిపో మేనేజర్ స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు డిపో పరిధిలోని ప్రయాణికులు వారి ఇబ్బందులు, సమస్యలు తెలపాలన్నారు. ప్రయాణికులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రవాణా సమస్యలు తమ దృష్టికి తేవాలని సూచించారు. 9959225678 ఫోన్ నెంబరుకు ఫిర్యాదులు తెలపాలని పేర్కొన్నారు.



వంద శాతం అక్షరాస్యత సాధించాలి: ఏపిఎం

ప్రజాశక్తి - యాదమరి: ఉల్లాస్ –అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా వంద శాతం అక్షరాస్యత సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎంఈశ్వరి తెలిపారు. యాదమరి మండలం లో గతంలో గ్రామ వార్డు సచివాలయం నిర్వహించి ఉన్న క్యాస్ట్ సర్వే ఆధారంగా 5,783 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. ప్రస్తుతం మండలంలో నిర్వహిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా 1800 మంది నిరక్షరాస్యులను పదిమందికి ఒక వాలంటీర్ చొప్పున గుర్తించి వాలంటీర్ల ద్వారా ఆరు నెలల కాలంలో(సుమారు నూరుగంటలు) సాయంత్రం 5 నుండి 7 వరకు గల సమయంలో డిజిటల్, ఆర్థిక,ఆరోగ్య, న్యాయ అక్షరాస్యతలు, సామాజిక అక్షరాస్యతలపై అవగాహన కల్పించి 2029 వ సంవత్సరం నాటికి మండలం నందలి పూర్తి నిరక్షరాస్యులు ను అక్షరాస్యులుగా చేసి అక్షరాస్యత సాధించు దిశగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గుర్తించిన వాలంటీర్లకు ఏపిఎం ఈశ్వరి, జిల్లా వయోజన విద్య పర్యవేక్షకులు ఈ గండేశ్వరరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సంఘమిత్రలు పాల్గొన్నారు.



టిడిపి మహిళా కార్యకర్తకు నివాళి

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన టిడిపి మహిళా కార్యకర్త లక్ష్మమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి నేతలతో కలిసి ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కూటమి పార్టీ తరుపున పది వేల రూపాయలను ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి కూటమి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెరుమాళ్, పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథ్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చంద్రబాబు ,మునిరెడ్డి, మురళీమోహన్, గిరిబాబు ,వెంకట రమణ, ఆనంద్, బాలకృష్ణారెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

అమరావతి కాలనీలో మౌలిక వసతులు: కమిషనర్

ప్రజాశక్తి-కుప్పం: కుప్ప మున్సిపాలిటీ అమరావతి కాలనీలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అమరావతి కాలనీలో సోమవారం కమిషనర్ శ్రీనివాస రావు పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అమరావతి కాలనీలో పర్యటించినప్పుడు ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం కమిషనర్ కాలనీలో పర్యటించి ప్రజల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా విధి దీపాలు, డ్రైనేజీ, రోడ్లు, ప్రాపర్టీ టాక్స్ తదితర



సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకురాగా పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఎంపీకి మంత్రి పదవి ఇవ్వాలి

దళిత ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు కొమ్మిట్ట ధనంజయరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాద్ రావుకి కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని దళిత ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు కొమ్మిట్ట ధనుంజయరావు కోరారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు రైల్వే కమిటీలో సభ్యులుగా ఉన్నారని ఆయన కృషి ఫలితంగా చిత్తూరు రైల్వే స్టేషన్ ఆధునికరణ పనులు వేగవంతంగా జరుగుతోందన్నారు. రైల్వే డబుల్ లైన్ నిర్మాణ పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో జాతీయ రహదారులు నిర్మాణంలో కీలక పాత్ర పోషించి వేగవంతంగా పనులు జరిగేలా కేంద్ర మంత్రులను కలిసి చర్యలు తీసుకున్నారన్నారు. డాక్టర్ బి ఆర్అంబేద్కర్ ఆశయ సాధనలో ఎస్సీ ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ప్రాధాన్య తిస్తూ ముందుకు సాగుతున్న ఎంపీకి కేంద్ర మంత్రి పదవి ఇస్తే ఆ పదవికి వన్నెతెచ్చేలా దగ్గుమళ్ళ ప్రసాద్ రావు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా పనిచేస్తారని తెలిపారు.

ఉపాధిలో అవకతవకలపై రగడ

సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: ఎంపీపీ మొగసాల రెడ్డప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం లో ఉపాధి హామీ అవినీతిపై పలువురు సర్పంచ్‌లు ప్రశ్నించారు. దీంతో సమావేశం ఉద్రిక్తంగా మారింది. మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, జడ్పిటిసి కేశవులు, డిటి కిషోర్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం కొత్తూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ చంద్రమౌళి అలియాస్ రాజారెడ్డి, ఉపాధి హామీ పథకంలో భారీ అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఒకరి పనికి మరొకరి ఫొటోలు జతచేసి కూలీల పేర్లతో తప్పుడు బిల్లులు వేసుకుంటున్నారని ఫొటో ఆధారాలతో సభలో చూపించారు. దీనిపై ఏపీవో సమాధానం ఇవ్వలేక తటపటాయించారు. ఇరిగేషన్ శాఖపై కూడా పంచాయతీ నాయకులు విమర్శలు


ఉపాధి హామీ పనుల అవినీతిపై ప్రశ్నిస్తున్న దృశ్యం

గుప్పించారు. చెరువులు మరమ్మతులు చేయకుండా నీళ్లను వదిలితే అవి గండిపడి నష్టానికి దారితీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీల గౌరవ వేతనం ఇప్పటికీ రాలేదని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య లన్నింటిపై ఫైల్ తయారు చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ హామీ ఇచ్చారు.

వయోజన విద్యపై అవగాహన

ప్రజాశక్తి - తవణంపల్లి: జిల్లా వయోజన విద్యా వాలంటీర్లకు పర్యవేక్షకుల ద్వారా సోమవారం అవగాహన కల్పించారు. ఈ సంద్భంగా ఏపిఎం నాగరత్నం, ఏపీఓ బాల మాట్లాడుతూ ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమం ద్వారా నూరు శాతం అక్షరాస్యత సాధించడమే ధ్యేయమన్నారు. తవణంపల్లి మండలంలో గతంలో గ్రామ, వార్డు సచివాలయం వారు నిర్వహించిన క్యాస్ట్ సర్వే ఆధారంగా ఐదువేల మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. ప్రస్తుతం మండలంలో నిర్వహిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా 2,100 మంది నిరక్షరాస్యులను పది మందికి ఒక వాలంటీరు చొప్పున గుర్తించి వాలంటీర్ల ద్వారా ఆరు నెలల కాలంలో(సుమారు నూరు గంటలు)



సాయంత్రం 5 నుండి 7 వరకు వున్న సమయం లో డిజిటల్, ఆర్థిక,ఆరోగ్య, న్యాయ అక్షరాస్యతలు, సామాజిక అక్షరాస్యతలపై అవగాహన కల్పించి 2029వ సంవత్సరం నాటికి మండలంలో నిరక్షరాస్యులను పూర్తి అక్షరాస్యులుగా చేసి అక్షరాస్యత సాధించు దిశగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గుర్తించిన వాలంటీర్లకు పర్యవేక్షకుల ద్వారా అవగాహన కల్పిం చారు.

50 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

ఉమ్మడి చిత్తూరు జిల్లా బీసీ అధ్యక్షులు లక్ష్మీ ప్రసన్న



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: యాభై శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా బీసీ అధ్యక్షులు లక్ష్మీ ప్రసన్న పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య , రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ, జాతీయ బీసీ నాయకులతో కలిసి సోమవారం ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో బీసీలు వెనుకబడి ఉన్నారని అన్ని రంగాల్లో 50 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించి బీసీల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షులు మునిరత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి , యువత నాయకులు ఖాదర్ బాషా, అన్సర్ బాషా, చిన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా నియమితులైన పాలకవర్గం సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వైయ్యాసి ఝాన్సీరాణి, వైస్ చైర్‌పర్సన్ పి.అనురాధ, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని కలిసి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గంలో స్థానం కల్పించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.


అవార్డు పొందిన పోలీసులను సన్మానిస్తున్న నాయకులు

అవార్డుతో బాధ్యత పెంపు

మండల టిడిపి అధ్యక్షులు ధరణి ప్రసాద్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : అవార్డులు బాధ్యతలు పెంచుతాయని మండల టిడిపి అధ్యక్షులు ధరణి ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డు అందుకున్న సిఐ శ్రీనివాసులు, డాక్టర్ శిరీష, కానిస్టేబుల్ సుధాకర్‌కి సోమవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి గుర్తింపు పొందిన వారికి రాష్ట్ర ప్రభుత్వం సత్కారాలు చేపట్టేందుకు అవార్డులను పంపిణీ చేస్తుందన్నారు. అవార్డు పొందిన వారు బాధ్యతాయుతంగా విధులు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలన్నారు ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ హరిబాబు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, నాయకులు రాధాకృష్ణన్ నాయుడు, రమేష్, రవీంద్ర నాయుడు, గురుస్వామి, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : 11 సంవత్సరాల తర్వాత నగరంలోని మార్గదర్శి స్కూల్ విద్యార్థులు సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థి దశలో తాము పాఠశాలలో వ్యవహరించిన తీరు, టీచర్ల తీసుకున్న శ్రద్ధను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించి ఆట పాటలతో సందడి చేశారు. నగరంలోని తోటపాళ్యం లో ఉండే మార్గదర్శి పాఠశాలలో 2013-14 సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు 11 సంవత్సరాల తర్వాత ఒకే చోట కలిశారు. తెలుగు ఉపాధ్యాయులు వెంకటేషన్ మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో స్థిరపడిన విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థులు దిలీప్, లోకేష్, శరత్, జీ.వెంకటేష్ లు మాట్లాడుతూ నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను దుశ్శాలువతో సత్కరించారు. వర్చువల్ విధానంలో గురువులతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో రామ్మూర్తి నాయుడు, మార్గదర్శి స్కూల్ కరస్పాండెంట్ సుధీర్‌రెడ్డి, ఉపాధ్యాయులు గౌతమి, దుర్గా, అరుణ, పూర్వ విద్యార్థులు పవన్‌కళ్యాన్, మహేష్, శివరాం, కార్తీక్, జయగణేష్, దేవి, కావ్య, యామిని, చందన పాల్గొన్నారు.

అర్హులైన వికలాంగులకు పెన్షన్ అందేలా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అర్హులైన వికలాంగులకు పెన్షన్ అందేలా చూడాలని మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు, మెడికల్ అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆరోగ్య పెన్షన్ కేటగిరీ కింద వికలాంగులకు ఫంక్షన్ వెరిఫికేషన్ మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు, మెడికల్ అధికారులతో పెన్షన్ పునరుద్ధరణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సదరన్ సర్టిఫికెట్ రాకపోవడంతో పెన్షన్ నిలిపివేయడం అందుకు గల కారణాలను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఆరోగ్య పెన్షన్ కేటగిరీ కింద వికలాంగులకు పెన్షన్ మరియు వికలాంగుల వెరిఫికేషన్ మరియు రీ అసైన్మెంట్ కొరకు ఆదేశాలు జారీ చేసి ఉన్నారు. పెన్షన్ కేటగిరీ కింద రాష్ట్ర ప్రభుత్వం వారు ఆరోగ్య పెన్షన్లు మరియు వికలాంగుల పెన్షన్లను వెరిఫికేషన్ మరియు అసైన్మెంట్ కొరకు ఆదేశాలు జారీ చేయడమైనదని, ఆదేశాల ప్రకారం ప్రత్యేక వైద్య బృందాలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ద్వారా సదరన్ క్యాంపు నిర్వహించి పెన్షన్ దారుల అర్హతను వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి గ్రామస్థాయిలో పంచాయతీ సెక్రెటరీ ద్వారా మండల స్థాయిలో ఎంపీడీవో ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకట ప్రసాద్, డిసిహెచ్ ఎస్. డాక్టర్ పద్మాంజలి, డిఆర్డిఏ పీడీ శ్రీదేవి, అడిషనల్ పీడీ డిఆర్డిఏ రవి, జిల్లా సర్వేలెన్స్ అధికారి అనిల్ కుమార్, ఆర్ బిఎస్ కె కోఆర్డినేటర్ డాక్టర్ సి.రవి, మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు, మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ద్రావిడ విశ్వవిద్యాలయం

- ద్రావిడ భాషలు, సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధే లక్ష్యం
- వెయ్యి ఎకరాల్లో విస్తరణ, ఆహ్లాదకర వాతావరణం
- ఇంజినీరింగ్ కళాశాల సాధనకు విశేష కృషి

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ రాష్ట్రాల కూడలి కుప్పం ప్రాంతంలో 1997 అక్టోబర్ 20న 'ద్రావిడ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేసిన ద్రావిడ విశ్వవిద్యాలయం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. ద్రావిడ భాషలు, సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధే లక్ష్యంతో ద్రావిడ విశ్వ విద్యాలయం ఏర్పాటైంది. విశ్వవిద్యాలయ సాధన కోసం ప్రభుత్వం వెయ్యి ఎకరాలకు పైగా స్థలం కేటాయించింది. కంప్యూటర్ సైన్స్, సిడిఎల్సి, చరిత్ర విభాగాలతో ప్రారంభమై ప్రస్తుతం 30 విభాగాలకు విస్తరించింది. ద్రావిడ విశ్వవిద్యాలయం క్యాంపస్ పచ్చదనంతో ఎంతో అహ్లాదక వాతావరణంలో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ద్రావిడ విశ్వవిద్యాలయం వివాదాలకు దూరంగా అభివృద్ధి పథంలో ముందుకెళుతోంది.

ద్రావిడ భాషలు, సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధే లక్ష్యం

ద్రావిడ భాషలు, సంస్కృతులపై విస్తృతమైన పరిశోధనలు వర్సిటీలో కొనసాగుతున్నాయి. సంస్కృతి, భాష, చరిత్ర పరిరక్షణను నాలుగు రాష్ట్రాల నుంచి 27 భాషల్లో అనేక వందల మంది పరిశోధకుల పదిశోధనలకు వేదికగా నిలిచింది. వందల సంఖ్యలో గ్రంథాలు, వేల సంఖ్యలో పరిశోధనల పత్రాలు ప్రచురించి ద్రవిడ భాష, శాస్త్ర, జానపద కళలకు జీవం పోస్తోంది. ఇప్పటి వరకు వంద మందికి పైగా విద్యార్థులు పిహెచ్డి పట్టాలు అందుకున్నారు. జానపద కళలు, భాషలు ఇలా అనేక అంశాలపై పరిశోధనలు సాగుతున్నాయి. వర్సిటీకి మొదట వీసీగా వచ్చిన ఆచార్య అరుణాచలం నుండి ప్రస్తుత వీసీ దొరస్వామి వరకు ప్రతి ఒక్కరూ వర్సిటీ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించారు.

వేలకు పైగా పుస్తకాలు..

ఈ విశ్వవిద్యాలయం వేలకు పైగా పుస్తకాలు కలిగి వుంది. 2013లో ఏర్పాటైన డిజిటల్ గ్రంథాలయంలో ప్రతి విద్యార్థి ఉచితంగా గంటపాటు అంతర్జాల సేవలు పొందే అవకాశం కల్పించారు.

శిల్పకళా సౌందర్యం

కర్ణాటక శిల్పకళా అకాడమీ వారి సవాకారంతో శిల్పకళలపై నిర్వహించిన వర్క్షాప్లో రూపుదిద్దుకున్న పది శిల్పకళా ప్రదేశాల్లో అమర్చడంతో పాటు ప్రతి విభాగం ముందు రాణి





ఫలకలపై ఆయా దూర ఆశయాలను 305గా అమర్చారు. దీంతో వర్సిటీ శిల్పకళా సౌందర్యంతో అందరిని ఆకట్టుకుంటోంది.

ప్రచురణల కేంద్రం..

ద్రావిడ విశ్వవిద్యాలయం ప్రచురణల కేంద్రం ద్వారా ద్రావిడ ఆంగ్లంలో పుస్తకాలను ప్రచురిస్తున్నారు. ప్రస్తుతం ప్రచురణల కేంద్రం ద్వారా తెలుగు, తమిళం, కన్నడం, తురు, మళయాలం భాషలతో పాటు ఆంగ్లంలో 300 పుస్తకాల దాకా ప్రచురించి దేశం మొత్తం విక్రయిస్తున్నారు. దీంతో పాటు తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, ఆంగ్ల భాషల్లో పరిశోధన పత్రికలు వెలువరిస్తున్నారు.

ద్రావిడ కళల పరిరక్షణ

జానపద కళల పరిరక్షణకు వర్సిటీలో ప్రత్యేకం గా ఒక విభాగం ఏర్పాటు చేసి, పురాతన వస్తువులు స్వీకరించి ఒక ప్రదర్శనశాలను అందుబాటులో ఉంచి ద్రావిడ కళలను పరిరక్షిస్తున్నారు.

అధ్యయన ఇంజనీరింగ్ కళాశాల సాధనకు కృషి

అధ్యయన ఇంజినీరింగ్ కళాశాల రావడానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రారు ఆచార్య కిరణ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు. గుడుపల్లి మండలం మారుమూల గ్రామమైన మండలానికి ఇంజినీరింగ్ కళాశాల సాధించేం దుకు కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు కు పదేపదే వినతిపత్రాలు అందిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సహకారంతో ఇంజినీరింగ్ కళాశాలను సాధించేందుకు తీవ్ర కృషి చేస్తున్నారు. స్థానిక నియోజకవర్గ నాయకుల సహకారంతో ఇంజినీరింగ్ కళాశాల సాధనకు వీరిద్దరూ విశేష కృషి చేస్తున్నారు.

పేదవాడి సూపర్ మార్కెట్ 'ఆదివారం సంత'

ప్రజాశక్తి- శాంతిపురం: మండల కేంద్రానికి సమీపంలోని బడుగుమాకులపల్లెలో ఆదివారం నిర్వహించే సంత పేదవాడి సూపర్ మార్కెట్గా విరాజిల్లుతోంది. ఈ సంతను 1986లో అప్పటి కెనమాకులపల్లె సర్పంచ్ జి వెంకటస్వామి నాయుడు స్థానిక పెద్దల సహకారంతో ప్రారంభించారు. మొదట్లో పశువుల సంతగా ప్రారంభించిన్పటికీ ప్రస్తుతం ప్రధాన మార్కెట్గా తీర్చిదిద్దారు. అంతే కాకుండా దినదినాభివృద్ధి చెంది తినమాకులపల్లె పంచాయతీకి ప్రధాన ఆదాయవనరుగా మారింది. చంటిపాప పాలబుడ్డి నుండి వృద్ధుడి తలపాగా వరకు అన్ని వర్గాల ప్రజలు రైతులకు అవసరమైన అన్ని


సంతలో వస్త్ర దుకాణాలు

రకాల వస్తువులు, నిత్యావసరాలు ఇక్కడ లభ్యమవుతాయి.

ప్రతి ఆదివారం కుప్పం- పలమనేరు జాతీయ రహదారి పక్కన బడుగుమాకులపల్లెలో నిర్వహించే ఈ పశువుల సంత మూడు రాష్ట్రాల కూడలిలో ఉండడంతో విశిష్ట ప్రాధాన్యత సంపాదించుకుంది. పాడి ఆవులు, కాడే ఎద్దులు దూడలు, గేదెలు, గొర్రెలు, కోళ్లకు ఇక్కడ మంచి గిరాకీ వుంది. వీటిని కొనుగోలు చేయడానికి తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఈ రోడ్డు, ధర్మపురి, సేలం, క్రిష్ణగిరి, వేలూరు, గుడియాతం, వానియంబడి, చెందిన ములభాగలు, కోలార్, బంగారుపేట, కేజీఎఫ్, మన రాష్ట్రంలోని పుంగనూరు, చిత్తూరు, పలమనేరు, బైరెడ్డిపల్లి ప్రాంతాల నుండి ఈ సంతకు వ్యాపారస్తులు వస్తుంటారు. పశువుల కొనుగోలులో ఇక్కడ కోట్ల రూపాయల డబ్బులు చేతులు మారుతుంటాయి. ఉదయం 6 నుంచి 2 గంటల వరకు పశువులు, ఆ తర్వాత కూరగాయలు నిత్యావసరాల సరుకుల దుకాణాల సంతను నిర్వహిస్తారు. మండల వాసులు వారానికి సరిపడా అన్ని రకాల వస్తువులు కూరగాయలను ఇక్కడ కొనుగోలు చేస్తారు.

ఇక్కడ ఒకవైపు పశువులకు, గొర్రెలకు, కోళ్లకు, నిత్యావసర సరుకులు, కూరగాయలు, తమల


సంతలో ఏర్పాటు చేసిన నిత్యావసర వస్తువుల దుకాణాలు

పాకులు, వస్త్రాలు ఇలా ఒక్కో వ్యాపారానికి సంబంధించి వేరువేరుగా నిర్వహిస్తారు. అదేవిధంగా మండల పరిధిలోని తుమ్మిసిలో మంగళవారం, కనుమల దొడ్డిలో గురువారం, రాళ్ళబుదుగురులో శనివారం రోజున వారపు సంతలు నిర్వహిస్తుంటారు. బయట ప్రాంతాల నుండి వ్యాపారస్తులు వచ్చి ఇక్కడ క్రయవిక్రయాలు చేస్తుంటారు. బయట ప్రాంతం నుండి జనం రావడంతో మండల కేంద్రంతో పాటు బడుగుమాకులపల్లెలో వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. సంతల నిర్వహణ వల్ల పంచాయతీలకు లాభం చేకూరడంతో పాటు నాణ్యమైన సరుకులు దొరకడం లాభదాయకమైన అని ఇక్కడి ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


వికలాంగుడికి ఆర్థిక సాయం అందిస్తున్న కలెక్టర్

వికలాంగుడికి రూ.లక్ష ఆర్థికసాయం

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): ప్రమాదంలో కళ్లు, చేయి కోల్పోయిన ఓ బాధితుడికి కలెక్టర్ లక్ష రూపాయలు ఆర్థికసాయం అందించారు. యాదమరి మండలం ముస్లిం వాడ గ్రామం 14 కండ్రిగలో ఉంటున్న ఇంతియాజ్ బేగం భర్త ఎస్.మునిరా ఎనిమిది నెలల ముందు రాళ్ళు కొట్టే పనికి వెళ్లినప్పుడు బ్లాస్టింగ్ జరిగి ప్రమాదంలో రెండుకళ్ళు, కుడిచేయి మణికట్టును కోల్పోయాడు. అంతేకాకుండా ఇతను పుట్టుకతో మూగవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆర్థిక సాయం నిమిత్తం కలెక్టర్కు అర్జీని అందించారు. చలించిన కలెక్టర్ మానవతా దృక్పథంతో సాయంత్రం కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ సొంత నిధులతో రూ.లక్ష రూపాయలు ఆర్థిక సహాయంగా చెక్కు రూపంలో అందించారు.

మణిమకుటం శాంతిపురం మండల సచివాలయం

- దేవాలయాన్ని పోలిన ఆకృతి
- రాష్ట్రంలో మరెక్కడా లేని భవన నిర్మాణం

ప్రజాశక్తి- శాంతిపురం: శాంతిపురం మండల సచివాలయం నియోజకవర్గ మణిమకుటంగా నిలిచింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శాంతిపురం మండల సచివాలయాన్ని అత్యంత సుందరంగా దేవాలయాన్ని పోలిన విధంగా నిర్మించారు. గత 20 సంవత్సరాలుగా రాష్ట్రంలోనే ప్రత్యేక సచివా లయంగా గుర్తింపును తెచ్చుకుంది. రోల్ మోడల్గా ఉన్న సచివాలయాన్ని చూసి జిల్లా అధికారులు చిత్తూరులో కలెక్టరేట్ను నిర్మించారు. 35 సంవత్సరాల క్రితం శాంతిపురం కుగ్రామంగా ఉండేది. కుప్పం- పలమనేరు ఆర్ అండ్ బి రోడ్డు ఉండేది. 1982లో ఈ రోడ్డును ప్రభుత్వం జాతీయ రహదారి నెంబర్ 219గా మార్చింది. 1992లో రాష్ట్రంలో నూతన మండలాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాంతిపురంను కూడా మండల కేంద్రంగా మార్చారు. అనంతరం దినదినాభివృద్ధి చెంది పెద్ద పట్టణంగా తయారైంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్గా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి ప్రభుత్వం హయాంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు కార్యాలయాల్లో ఒకే భవనంలో


శాంతిపురం మండల సచివాలయం

ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో మాజీ ఎంపీపీ ఈ వెంకట మునిరెడ్డి హయాంలో ఈ భవనాన్ని జన్మభూమి పథకంలో ఫుడ్ ఫర్ వర్క్ స్కీం ద్వారా కోటి రూపాయలు నిధులు వెచ్చించి నిర్మించారు. ఈ మండల సచివాలయంను 2004, ఏప్రిల్ 16న చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి అప్పటి పాలకులు ప్రత్యేక చొరవ తీసుకొని సచివాలయం ప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేసి రకరకాల చెట్లు , పూలమొక్కలు నాటించి సచివాలయం చుట్టూ పచ్చదనాన్ని పరిచారు. కార్యాలయం ముందు భాగం దేవాలయ గోపురాలు పోలిన విధంగా నిర్మించడంతో కొత్తగా వచ్చేవారికి ఇది ఒక దేవాలయంలాగా కనిపిస్తుంది. ఈ భవనం జాతీయ రహదారి పక్కనే ఉండడంతో సుదూర ప్రాంతాలకు చెందిన వారు ఈదోక దేవాలయంగా భావించి భక్తి భావనతో చూడడం విశేషం.

శాఖల వారీగా కార్యాలయాలు..

శాంతిపురం మండల సచివాలయంలోని మూడు అంతస్తులలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి శాఖల వారీగా ప్రత్యేక కార్యాలయాలను ఏర్పాటు చేశారు. సచివాలయంలోకి ప్రవేశించగానే ఎడమవైపు మండల పరిషత్, కుడి వైపు తహశీల్దారు కార్యాలయాలు ఉన్నాయి. పై అంతస్తులో పంచాయతీరాజ్, ఈవోపీఆర్డీ కార్యాలయం, సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు కార్యాలయంకు వచ్చినప్పుడు ప్రజలతో సమావేశం కావడానికి వారివారి హోదాల ప్రకారం ఎంపీపీ, జడ్పిటిసి ఛాంబర్లను కేటాయించారు. మండల సచివాలయం వెనుక వైపు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం, వెనుకను ఉన్న ప్రాంగణంలో వెలుగు, ఉపాధి హామీ, ఇరిగేషన్, హౌసింగ్, పట్టు పరిశ్రమ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఆవరణలోనే ఎంఆర్సి భవనం, గ్రంథాలయం ఏర్పాటు చేశారు.

వికలాంగులకు ర్యాంప్..

మండల సచివాలయం ముందున్న మెట్లు పక్కన వికలాంగులు కార్యాలయానికి రావడానికి సౌకర్యవంతంగా ర్యాంపును నిర్మించారు. మెట్లు ఎక్కి కార్యాలయంలో లోపలికి రాలేని వృద్ధులకు కూడా ఇది సౌకర్యవంతంగా ఉంది.

దుకాణాల సముదాయం...

ప్రజలకు అన్ని విధాల సౌకర్యవంతంగా అన్ని వసతులు అందుబాటులో ఉండడానికి మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ను నిర్మించారు. ఈ కాంప్లెక్స్లో 8 అంగడి రూములను 8 మంది నిరుద్యోగులకు ఇచ్చి స్వయం ఉపాధి కల్పించారు. ప్రతిరోజు ఆయా శాఖల అధికారులు కార్యాలయాలకు వచ్చి ప్రజాసమస్యలను పరిష్కరించడానికి శాఖల వారీగా కేటాయించడంతో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

అందరికి అందుబాటులో కార్పొరేట్ విద్య

కృష్ణతేజ జూనియర్ కళాశాలకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఇంటర్మీడియేట్ దశ ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకైకమైనది. ఒక రకంకా చెప్పాలంటే విద్యార్థి భవిష్యత్తుకు నిచ్చెన లాంటిది. ఇంటర్మీడియేట్ అందుకే చాలా మంది ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు తమ పిల్లలు ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు తెచ్చు కోవడమే, కాకుండా సజావుగా చదువుకోవాలని కోరుకుంటారు. చదువుల ఒడి నుంచి ఇంటర్మీడియెట్ దశలో జారిపోతే మళ్లీ వారు గాడిలోపడ్డ సంఘటనలు చాలా అరుదు. అంతట ప్రాముఖ్యత కల్గిన ఇంటర్మ యేట్‌లో అందరికి కార్పొరేట్ విద్య అందుబాటుకి తీవాలని " కృష్ణ తేజ జూనియర్ కళాశాలను స్థాపించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కొత్త ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని చదలవాడ నగర్‌లో ఉన్న కృష్ణ తేజ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యార్థులకు నిజమైన కార్పరేట్ తరహా విద్యను అందించాలనే ఆలోచనతో 2001 లో కృష్ణ తేజ జూనియర్ కళాశాలను డాక్టర్ చదలవాడ కృష్ణ మూర్తి స్థాపించారు. విద్యార్థుల చేత పాఠాలు బట్టి పట్టించకుండా, సబ్జెక్టుపై అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా వారికి సబ్జెకుపై ఇష్టం కలిగేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. దీంతో కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరంలోని ఈ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలు అత్యధిక ర్యాంకులు సాధించి చరిత్ర సృష్టించారని తెలిపారు.

ఆధునికి బోధనా పద్ధతులు .. జనరల్‌గా ఏ కళాశాలలో నైనా 10వ తరగతి మార్కుల ఆధారంగా ఇంటర్మీడియట్‌లో విద్యార్థులను విభజిస్తారు. కృష్ణ తేజ కళాశాలలో అలా చేయడం లేదు. విద్యార్థి మేధాశక్తిని బట్టి విభజించి పాఠాలు బోధిస్తున్నారు. కింది స్థాయి నుంచి పాఠాలను పూర్తిగా చదివించి వారికి ప్రతి నెల పరీక్షలు నిర్వహిస్తారు. ఏదైనా ఒక సబ్జెక్టులో తక్కువ మార్కులు వస్తే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. తరువాత నెలలో మంచి మార్కులు సాధించేలా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.అధ్యాపకులే సమస్త ప్రగతికి కారణం.. అనుభవం, అంకితభావం ప్రమాణంగా ఎంపిక చేసిన అధ్యాపక బృందం అద్భుతాలు సృష్టిస్తోంది. అత్యున్నత విద్యార్హత, సుదీర్ఘ అనుభవం ఉన్న అధ్యాపకులు కృష్ణ తేజ కళాశాలను మిగతా కళాశాలల కంటే ముందు వరుసలో నిలుపుతున్నారు. కళాశాలలో పనిచేస్తున్న ఆధ్యాపకులందరూ పీజీలు చేసిన వారే. పరిజ్ఞానం అనుభవంతో కేవలం ర్యాంకు మిషన్లుగా కాకుండా విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్దుతున్నారని వెల్లడించారు.

కాన్సెప్ట్ ఆధారిత చదువులు.. చీకటి గదులు, అరకొర వసతులు, కిక్కిరిసిన విద్యార్థులతో నిండిన తరగతి గదులకు కృష్ణ తేజ కళాశాల దూరంగా ఉంటుంది. గడియారం ముల్లు వెనుక పరుసలు తీస్తూ మానసిక రోగులను తయారు చేయడం తమ అభిమతం కాదన్నారు. ఇంటర్ స్థాయిలో కార్పోరేట్ కాలేజిల్లో పాఠాలు బట్టిపట్టి విద్యార్థులు మార్కులు సంపాదిస్తున్నారు. సబ్జెక్టు మీద అవగాహన లేక పోవడంతో తర్వాత ఉన్నత విద్య, ప్రొఫెషనల్ కోర్సులలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం ప్రాక్టికల్‌గా నిరుపితమైనది. ఇతర కళాశాలలు 90 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఇంజనీరింగ్, మెడికల్, డెంటల్, ఫార్మా, డిగ్రీ కళాశాలలో 50 శాతం మార్కులు కూడా సాధించ లేదు. విద్యార్థులకు కాన్సెప్ట్ వివరించక పోవడం, వ్యక్తి గత శ్రద్ధ తీసుకోక పోవడంతో వారు ఉద్యోగ అన్వేషణలో ఫెయిల్ అవుతున్నారు. ఇందుకు కృష్ణ తేజ కళాశాల యాజమాన్యం తమ చేతులతో జవాబు చెపుతున్నారు. విశాలమైన తరగతి గదులు, ఆటస్థలం. ఇంటర్ సబ్జెక్టులపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పిస్తున్నారు.

అధునాతన ల్యాబ్ సౌకర్యం.. కృష్ణ తేజ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఎంపిసి, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌ల కోసం అధునాతనమైన ల్యాబొరేటరీ సౌకర్యం కల్పించారు. ఫిజిక్స్, కెమిస్ట్, బోటనీ, జువాలజీ తదితర సైన్స్ గ్రూపుల కోసం 'ఏ ఇతర కళాశాలక తీని విధంగా, విద్యార్థుల కోసం ల్యాబ్ ను ఏర్పాటు చేశామని తెలిపారు

క్రీడలకు ప్రోత్సాహం.. కృష్ణ తేజ యాజమాన్యం క్రీడలకు ప్రత్యేకంగా ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. క్రికెట్, చెస్ షాట్ పుట్‌లతో జోనల్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో తమ విద్యార్థులు ఎందరో ప్రతిభ కనబరిచారని వెల్లడించారు. ప్రతి విద్యార్థికి మనోవికాసమే ధ్యేయంగా పనిచేస్తున్నాం, ఇతర కళాశాలల్లో చేస్తున్న విధంగా తాము విద్యార్థుల చేత బట్టీలు పట్టించండం లేదు. స్వేచ్ఛాయుత పాతావరణంలో విద్యార్థులకు ఆయా సబ్బకులపై సహజ సిద్ధంగా అనగావాన కలిగేలా చేస్తున్నాం. ర్యాంకులు, మార్కులు పేరు చెప్పి విద్యార్థులను ఒత్తిడికి గురి చేయడం మా అభిమతం కాదు, అందుకే మా దగ్గరున్న ప్రతి విద్యార్థి ఉల్లాసంగా, ఉత్సాహంగా చదువు కుంటున్నాడని తెలిపారు. విద్యార్థులు కృష్ణ తేజలో చేరి తమ భవిష్యత్తును ఉన్నత శిఖరాలు వైపు ఉపయోగించేలా చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7207941258 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు :

- విశాలమైన తరగతి గదులు
- అధునాతన ల్యాబోరేటరీలు
- అధ్యాపకుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్
- విశాలమైన, అన్ని వసతులతో కూడిన క్రీడా ప్రాంగణం

స్విమ్స్ ఆసుపత్రిలో నర్సులకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయండి

కార్మిక సమస్యల పరిష్కారానికి తోడ్పడండి : స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్‌కు సిఐటియు నేతల విజ్ఞప్తి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్:600 మందికి పైగా పనిచేస్తున్న స్విమ్స్ ఆసుపత్రిలో నర్సుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి స్విమ్స్ డైరెక్టర్ ఆర్వి కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. స్విమ్స్ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారానికి చొరవ చూపి తోడ్పడాలని, కార్మికులకు, మహిళా కార్మికులకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని, టీటీడీ యాజమాన్యంతోను, ప్రభుత్వంతోనూ చర్చించామని, వీలైనంత త్వరలో అన్ని రకాల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నర్సులకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని సమస్యలు నేరుగా తెలియజేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ రామ్, జీఎం గోపి, ఆదికృష్ణయ్య, సిఐటియు నగర నేత కే.వేణుగోపాల్, స్విమ్స్ యూనియన్ అధ్యక్షులు వి. సూరి, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి మారి ముత్తు, జనార్ధన్, రాజా, గోపి, కోటయ్య , పీవీ మునికృష్,ణ మునీంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :తిరుపతి, స్విమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం గూడూరు మండలం, చెన్నూరు పిహెచ్ సిలో ఉచిత మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకురాలు మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం వలన క్యాన్సర్ మహమ్మారి నుండి తప్పించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజ్, నోడల్ ఆఫీసర్లు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ లలిత్‌లు పాల్గొన్నారు.

ఓట్ల దొంగలకు పరిపాలించే హక్కు లేదు

కాంగ్రెస్ పార్టీ నేతల క్యాండిల్ ర్యాలీ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశంలో దొంగ ఓట్లతో బిజెపీ అధికారంలోకి వచ్చిందని, ఇందుకు భారత ఎన్నికల సంఘం సహకరిస్తోందని కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన తీవ్ర ఆరోపణల నేపథ్యంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు తిరుపతిలో సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు, తిరుపతి నగర అధ్యక్షులు గౌడపేరు చిట్టి బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా అధికారం కోసం అడ్డదారులు తొక్కిన వారికి ప్రజలు రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. బీహార్ రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ దొంగ ఓట్ల తంతును రాహుల్ గాంధీ బాహ్య ప్రపంచానికి చూపడంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వణుకు పుట్టిందన్నారు. బిజెపి ప్రజాస్వామిక పద్ధతులను, దొంగ ఓట్ల తంతును ప్రజలకు వివరించడానికి రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రకు దేశంలోని మేధావులు, యువకులు, మహిళలు, ప్రజాతంత్ర వాదులు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పంచముఖ ఆంజనేయ స్వామి గుడి నుండి ఆర్టిసి బస్టాండు వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు ఈ క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ క్యాండిల్ ర్యాలీలో పిసిసి ఉపాధ్యక్షులు రాంభూపాల్ రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకటనరసింహులు, ఏఐసిసి బీసీ సెల్ కన్వీనర్ కంభంపాటి మురళీకృష్ణ, చిత్తూరు శివశంకర్, స్వరూప్ నాయక్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు శివ బాలాజీ, గొడుగు చింతల గోపి తదితరులు పాల్గొన్నారు.

దళారులకు సీఐ హెచ్చరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులను తప్పు దోవ పట్టిస్తూ అందిన కాడికి దోచుకోవడమే కాకుండా ఆలయ విధులకు ఆటంకం కలిగిస్తున్న పలువురు దళారులను సోమవారం వన్టౌన్ సిఐ అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి ఆలయంలో కనిపిస్తే, భక్తులను మోసగిస్తే క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి వద్ద బైండోవర్ చేసి మొదటి తప్పు కింద వదిలిపెట్టారు. పట్టణంలోని డీజే సౌండ్ నిర్వాహకులకు సిఐ గోపి ముందస్తు వార్నింగ్ ఇచ్చారు. రానున్న వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పరిధిలో దాటి డిజె సౌండ్స్ పెడితే న్యూసెన్స్ చట్టం కింద కేసులు పెడతామని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు, సోమవారం పుత్తూరు మండలం తహాశీల్దార్ కార్యాలయం దగ్గర పేదలకు ఇంటి స్థలాల ఇవ్వాలని సిపిఐ జిల్లా సమితి ఆదేశాలతో, పుత్తూరు మండల కార్యదర్శి డి.మహేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు, ఎంజాయ్ మెంట్ సర్టిఫికెట్‌లు, జగనన్న కాలనీలలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని తహాశీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు చంద్రబాబు, కృష్ణారెడ్డి, రమణ, వెంకట ముని, వెంకటేష్, శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : ఇళ్ల స్థలాలకు పట్టాలు, ఎంజాయ్మెంట్ సర్టిఫికెట్లు, జగనన్న కాలనీలలో కనీస వసతులు కల్పించాలని సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి సిహెచ్ శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జగనన్న కాలనీ నివాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మార్వోను కలిసి డిమాండ్లతో కూడిన అర్జీ సమర్పించారు. ఈ ధర్నాలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, సత్యనారాయణ, గోవర్ధన్, గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్, మునిమోహన్, సుజనా, సిద్దమ్మ, సుబ్బరత్న, లక్ష్మి, చిట్టెమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



రైతులకు అవగాహన కల్పిస్తున్న తహాశీల్దారు శ్రీదేవి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భూముల రీ సర్వేతో సమస్యలు పరిష్కారమవుతాయని, రైతులు రీ సర్వేని సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దార్ శ్రీదేవి సూచించారు. సోమవారం ఆలత్తూరు, కొత్తపాలెంలో రెవెన్యూ అధికారులు భూముల రీ సర్వేకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో, వారి వారి భూముల వద్ద సర్వే సిబ్బంది చేరుకుని వివరాలు తీసుకువస్తే పరిష్కరిస్తారని తెలిపారు. రీ సర్వే వివరాలు: ఆలత్తూరు, కొత్తపాలెం మొత్తం విస్తీర్ణం 386.78 ఎకరాలు, ఇందులో పట్టా భూములు 263.60 ఎకరములు, ఇందులో ప్రభుత్వ భూములు 123.18 ఎకరములు, ఈ భూమిలో మొత్తం గల సర్వే నంబర్లు 56 మాత్రమే. మొత్తం సర్వే నంబర్లకుగాను సబ్ డివిజన్ 909 మాత్రమే. ఇందులో ప్రభుత్వ ఖాతాలో 9, నేషనల్ ఖాతాలు 76 కావున వచ్చే వారం నుండి ఆ గ్రామంలో రీ సర్వే మొదలవుతుందని రెవెన్యూ అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రాజ్కుమార్, విఆర్ఓ భాస్కర్ తదితరలు పాల్గొన్నారు.

పేదల భూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) పేదల భూ సమస్య పరిష్కారం కోసం ఇచ్చిన పిలుపులో భాగంగా చంద్రగిరి మండల తహాశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ చంద్రగిరి మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం నిర్వహించి, ఎంఆర్ఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేసినట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి మండల సమితి కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. మండలంలో ఐతేపల్లి శానంభట్ల కొంగలవారిపల్లి, తొండవాడ, కొత్తపేట పలు ప్రాంతాలలో భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మండలంలో ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని, పట్టాలు లేక కరెంటు మీటర్లు లేకుండా ఉన్న వారందరికీ న్యాయం చేయాలని కోరారు. అలాగే జగనన్న కాలనీలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏఐటియుసి నగర అధ్యక్షుడు కేవైరాజ, లాజరస్, బాబు, పార్వతి, ఉమాపతి బాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు 5 అర్జీలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కు 5 అర్జీలు వచ్చినట్లు, తహాశీల్దార్ శైలకుమారి తెలిపారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని 2, భూమి సర్వే కొరకు1, పట్టాదరు పాస్ బుక్ కొరకు1, జనధ్రువీకరణ కొరకు1 వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎపిమం మునిరాజ, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో ట్రాఫిక్ అదుపు తప్పింది



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, విచ్చలవిడిగా ఆటోలు రోడ్లపై తిరగడం పరిపాటి అయింది. కాలం చెల్లిన ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రజలకు పొగ బెడుతున్నాయి. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా పోలీసులు చూసి చూడనట్లే వ్యవహరిస్తున్నాన్నారు. ఇక ప్రైవేటు బస్సులు ట్రాఫిక్ రూల్స్ పట్టించుకోకపోయినా, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇతర వాహనాలకు వర్తించే నిబంధనలు ఈ బస్సులకు వర్తించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ కష్టాలను తగ్గించే దిశగా ట్రాఫిక్ పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై ట్రాఫిక్ సీఐ శేఖర్ రెడ్డి స్పందిస్తు కూరగాయల మార్కెట్‌ను ప్రస్తుతం ఉన్న ప్రదేశం నుంచి వేరే ప్రాంతానికి మారిస్తే కొంత ట్రాఫిక్ సమస్య తీరుతుందని తెలిపారు. అలాగే రైల్వే గేటు వేసినప్పుడు, అండర్ బ్రిడ్జిలో వాహనాలు వెళ్లేప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోందని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముస్లిం హక్కుల సాధనే లక్ష్యం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మైనారిటీల హక్కుల సాధనే ముస్లిమ్ ఐక్య వేదిక లక్ష్యమని, ఆ వేదిక రాష్ట అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. సోమవారం ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు, పట్టణంలోని జామియా మసీదు ప్రాంగణంలో నియోజకవర్గ నాయకులతో సమావేశమయ్యారు. నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ముస్లిం ఐక్య వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆర్ఎస్కే జిలాని బాషా, సుబహాన్‌లను ఎంపిక చేశారు. లీగల్ సెల్ సభ్యులుగా న్యాయవాది సర్దార్, గౌస్ లను ఎంపిక చేశారు. ఎంఐవి సభ్యులకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ నాలుగేళ్ళ క్రితం ఐక్య వేదికను స్థాపించామన్నారు. ముస్లిం మైనారిటీల హక్కుల సాధనే తమ లక్ష్యమని తెలిపారు. ఐక్య వేదికను బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి షౌకత్, రాష్ట్ర సమన్వయకర్త ఎస్ఎం రషీద్, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు జీలాని బాషా, సుబహాన్, వాకాడు మండల నాయకులు నూర్ ఎస్దాని, ఖాదర్ బాషా, అర్షద్, బాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి అర్బన్ అండ్ రూరల్ మండలాల్లో గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లపట్టాలను రద్దుచేసి, ఇల్లు లేని నిరుపేదలకు మరలా పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు తిరుపతి ఆర్డీవో కార్యాలయంతో సిపిఐ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రామానా యుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను రద్దు చేసి, పట్టణ ప్రాంత వాసులకి రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత వాసులకు మూడు సెంట్లు చొప్పున ఇస్తామన్న హామీ మేరకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డిఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర్ కార్యదర్శి జే విశ్వనాథ్, నగర సహాయ కార్యదర్శి బండి చలపతి, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి, ఎన్ శివ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకులను తొలగించడం దారుణం : వర్సిటీ పాలకమండలి సభ్యురాలు జ్యోతి



ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యా సంవత్సరం మధ్యలో వర్సిటీలో ఒప్పంద అధ్యాపకులను నోటిఫికేషన్ ద్వారా రోస్టర్ ప్రకటించి ఇంటర్వ్యూలకు పిలవకుండా పర్ఫామెన్స్ రివ్యూ పేరుతో ఇంటర్వ్యూలను నిర్వహించి తొలగించడం హేయమైన చర్యగా వర్సిటీ పాలకమండలి సభ్యురాలు జ్యోతి తీవ్రంగా ఖండించారు. సోమవారం వర్సిటీ ఇన్చార్జ్ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 సంవత్సరాలు, 8 సంవత్సరాలు, ఐదు సంవత్సరాలు పైగా వర్సిటీలో తమ జీవితాన్ని ధారపోసి ఏళ్ల తరబడి వర్సిటీకి సేవ చేస్తున్న ఒప్పంద అధ్యాపకులను 43 మందిని తొలగించడం దారుణమైన చర్యని విమర్శించారు. ఇటువంటి చర్యలు అసంబంధంగా తీసుకోవడం ద్వారా వారి సిటీ ప్రతిష్ట దిగజారి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కమ్యూనిటీ హాలా..? పశువుల పాకా..?

- అగరాలలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి అనుచరుడి దౌర్జన్యం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): మండల పరిధిలోని అగరాలలో ప్రజల సౌకర్యార్థం తుడా నిధులతో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ హాలును వైసీపీ సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి అనుచరుడు లక్ష్మణాచారి తన ఆధీనంలో ఉంచుకుని పశువులు పాకగా మార్చుకున్నాడు. గ్రామస్తులు అందరూ కలిసి సమావేశాలు, వివాహ వేడుకలు, పండుగ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు గత వైసిపి ప్రభుత్వంలో మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా చైర్మన్‌గా కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేసి నిర్మింప చేశారు. ఆ కమ్యూనిటీ హాలును పంచాయతీ అధికారుల స్వాధీనంలో ఉంచుకోవాల్సి ఉంది. కానీ స్థానిక సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి ఆ హాలుకు తాళాలు వేసి, తన స్వాధీనంలో ఉంచుకున్నాడు. రాత్రి వేళల్లో తన మేకలు, మేకపోతులు, ఆవులు దొంగతనానికి గురు కాకుండా కమ్యూనిటీ హాల్‌లో కట్టేసి పశువుల పాకగా మార్చేశాడు. అలాగే పశువులు తాగునీరు కోసం పంచాయతీ కొళాయి నుండి పైపు ఏర్పాటు చేసి పశువులకు తాగునీరు అందజేస్తున్నాడు. ఈ వ్యవహారంపై గ్రామస్తులు ప్రశ్నిస్తే.. సర్పంచ్ అగరాల భాస్కర్ రెడ్డి అనుచరుడిని.. మా ఇష్టం.. మేము కట్టించిన కమ్యూనిటీ హాల్‌ను మేము ఏమైనా చేసుకుంటామంటూ గ్రామస్తులపై తిరగబడుతున్నాడు. లక్షలాది రూపాయల తుడా నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించకుండా పశువుల పాకగా వాడుకుంటుంటే పంచాయతీరాజ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించి కమ్యూనిటీ హాలును ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించేలా చేయాలని కోరుతున్నారు. లక్ష్మణాచారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటరత్నం నాయుడిని వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శుల ద్వారా పశువులను కమ్యూనిటీ హాల్ నుండి తొలగించి ఆ కమ్యూనిటీ హాల్ను గ్రామపంచాయతీ ఆధీనంలో ఉంచుకుంటామని వివరణ ఇచ్చారు.

స్పందనకు వందనం
రోడ్డుపై గుంతలు పూడ్చివేత



ప్రజాశక్తి -కోట : కోట మండలం, విద్యానగర్, గాంధీ బొమ్మ నుండి కాలేజీ రోడ్డు మీదగా వెళ్లే మెయిన్ రోడ్డుపై అనేక గుంతలు ఉండడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై ప్రజాశక్తిలో 'రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..?' అనే శీర్షికతో కథనం ప్రచురితమయింది. దీంతో స్పందించిన ఆర్ అండ్ బి డిఈ చంద్రశేఖర్ రెడ్డి, కాంట్రాక్టర్లు సోమవారం రోడ్డుపై తాత్కాలికంగా సిమెంటు, కంకర కలిపి గుంతలు పూడ్చారు. దీంతో స్థానికులు ప్రజాశక్తికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పొలంలో విద్యుత్ వైర్లు చోరీ



ప్రజాశక్తి - రామచంద్రా పురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం, తొండవాడ పంచా యతీ అగ్రహారానికి చెందిన జగన్మోహన్ నాయుడు పొలంలో స్టార్టర్ నుంచి బోరు బావి వరకు ఉన్న విద్యుత్ వైర్లును పట్టపగలే దొంగలు దోచుకెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల వరకు పొలం వద్దనే ఉండి, భోజనానికి ఇంటికి వచ్చిన జగన్మోహన్ నాయుడు తిరిగి సాయంత్రం అగ్రహారంలోని పొలం దగ్గరికి వెళ్లేసరికి విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఇదిలా ఉండగా పొలంలో కూర్చొని మద్యం సేవిస్తున్న వారిని జగన్మోహన్ తల్లి మందలించగా ఆమెపై దుండగులు తిరగబడ్డారు. ఈ ఘటనపై జగన్మోహన్ నాయుడు పోలీసులుకు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. వారే విద్యుత్ వైర్లు చోరీకి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధి, విందూరుకి పోయే రోడ్డు జెండా మాను సెంటర్ వద్ద సైక్లిస్ట్‌ను ఓ ప్రైవేట్ కలశాల బస్సు ఢీ కొన్న సంఘటన చోటు చేసుకుంది. గూడూరు రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు వేముల పాలెంకి చెందిన శివయ్య సైకిల్‌పై పాలు తీసుకొని జెండా మాను సెంటర్ నుండి నిమ్మ మార్కెట్ దగ్గరికి వెళ్తుండగా వెనుక వైపు నుండి ఓ ప్రైవేట్ కలశాల బస్సు అదుపు తప్పి డీ కొనింది. శివయ్యకి గాయాలయ్యాయి. స్థానికులు వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడు మృతి

ప్రజాశక్తి-ఏర్పేడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున ఏర్పేడు మండలంలోని మేర్లపాక వద్ద చోటుచేసుకుంది. ఏర్పేడు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కథనం మేరకు రేణిగుంట మండలం, కరకంబాడి పంచాయతీ, తారకరామ నగర్‌కు చెందిన పాలెం ప్రకాష్ (29) ఆది వారం రాత్రి సొంత పని నిమిత్తంలో తన ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరి తిరిగి వస్తుండగా మేర్లపాక వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేలో సాయి విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం పక్కనున్న, సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ఆదివారం జరిగిన ఆలిండియా కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్‌లో పాల్గొన్నారు. ఒంగోలులో జరిగిన ఈ ఛాంపియన్షిప్‌లో పాఠశాలకు చెందిన నిండలి మోక్షిత్ అండర్ 12 విభాగంలో, గృశ్నేశ్వర్ అండర్ 14 విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దయాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈపై ఫిర్యాదు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు గ్రామ సర్పంచ్ సోమవారం ఉదయం ఎంపీడీవో వెంకటరత్నమ్మకు బుచ్చినాయుడు కండ్రిగ అసిస్టెంట్ ఇంజనీర్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న మాట్లాడుతూ తమ పంచాయతీలో ఎప్పటినుండో విద్యుత్ స్తంభాలు లేక సింగల్ లైన్ కిలోమీటర్‌కు ఒక స్తంభం చొప్పున ఉండడంతో లైన్లో క్రింద వేలోడుతూ ప్రమాద భరితంగా ఉన్నాయని ఆరోపించారు. ఎన్నోసార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదన్నారు. 5వ తేదీ జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు కూడా విన్నవించామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు తక్షణమే సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారని, కానీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీడీవో వెంకటరత్నమ్మకు ఫిర్యాదు చేయగా, ఆమె స్పందించి, విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించమని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి


కె.చరిత్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :ఈ నెల 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు తమిళనాడులో జరిగిన సౌత్ జోన్ సి.బి.యస్.సి ఆర్చరీ పోటీలలో చిల్లకూరు, లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ ఆర్చరీ క్రీడాకారుడు కె.చరిత్, 9వ తరగతి విద్యార్థి రికర్వ్ రౌండ్ విభాగంలో 360 పాయింట్లకు 328 పాయింట్లతో సిల్వర్ మెడల్ సాధించాడని పాఠశాల కారస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి తెలియజేసారు. పంజాబ్ రాష్ట్రం, సంగూర్‌లో సెప్టెంబర్ 20వ తేదీ నుండి 25 వరకు జరుగు సి.బి.యస్.సి జాతీయ ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.

గుండె వ్యాధి నిపుణులు రాక


డాక్టర్ ఎమ్.జగదీష్

ప్రజాశక్తి -కోట : నెల్లూరు నుండి ప్రముఖ గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ జయరామ్ కోట మండలం, ఎన్టిఆర్ నగర్, జనతా క్లినిక్‌కు వస్తున్నట్లు డాక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. 1500 రూపాయల ప్యాకేజీతో ఈసీజీ, ఫాస్టింగ్ లిక్విడ్ ప్రొఫైల్ టెస్ట్, ఆర్ బి ఎస్, బిపి, 2డి ఎకో, కార్డియాలజీ కన్సల్టేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల మూడవ గురువారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు డాక్టర్ జయరామ్ అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పరిధిలో గుండె వ్యాధికి చెందిన లక్షణాలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యా సామగ్రి వితరణ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :స్థానిక మున్సిపాలిటీ పరిధి, చెర్లోపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు సౌజన్యంతో విద్యార్థి విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ల తదితర విద్యా సామగ్రి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెర్లోపల్లి, చిన్నరాజుకుప్పం, నెత్తం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. చెర్లోపల్లి స్కూలుకు బీరువా అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనపాల్, చంద్ర యాదవ్, మధుసూదన్ రాజు, మణికంఠ, పోతుగుంట రమేష్, శ్రీనివాస మందడి తదితరులు పాల్గొన్నారు.

భారీ వినాయక విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు



ప్రజాశక్తి - నాయుడుపేట:తిరుపతి జిల్లా, నాయుడులో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా, భారీ విగ్రహ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రతి ఏటా నాయుడుపేట, చుట్టుపక్కల మండలాల్లో పెద్ద,పెద్ద వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, భారీ సెట్టింగులతో వినాయక చవితి నిర్వహిస్తుంటారు. ఈ సంవత్సరం వినాయక చవితి ఏర్పాట్లు పూర్తికావచ్చాయని వినాయక చవితి కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. నాయుడుపేట, రాజగోపాలపురం గ్రంథాలయం వద్ద ప్రతి ఏటా సినిమా సెట్టింగులతో భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నాయుడుపేట వినాయక చవితి కమిటీ సభ్యులు సన్నాహాలు ప్రారంభించారు. విగ్రహాన్ని హైదరాబాద్ నుండి తెప్పించనున్నారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోట్లపూడి రాజేష్, భారతాల సాయిరామ్ కిషోర్, వారి బృందం ఆధ్వర్యంలో గత 25 ఏళ్లుగా వినాయక ఉత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం విగ్రహ ప్రతిష్ఠ ఏర్పాట్లకు బెంగాల్ నుండి వచ్చిన కళాకారులు పనులు ప్రారంభించారు. సెప్టెంబర్ 4న వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహించి, నిమజ్జనం చేసేందుకు తూపిలిపాలెం సముద్రంలో నిమజ్జనం చేయనున్నారు.

నేటి నుండి సీనియర్ జర్నలిస్ట్ ఫోరం జాతీయ మహాసభలు

జాతీయ పెన్షన్ స్కీమ్, అమలు కోసం తీర్మానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:ఈనెల 19 నుండి 22 వరకు నాలుగు రోజులు పాటు కేరళ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో సీనియర్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో జాతీయ మహాసభలను మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్నట్లు ఏపీ రాష్ట్ర వెటరన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డా. టి.జనార్ధన్, ఎం.నరేందర్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ 21 రాష్ట్రాల నుండి 250 మంది సీనియర్ జర్నలిస్టులు ఈ మహాసభలో పాల్గొంటున్నారని తెలిపారు. మహాసభను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తున్నారని, రెండోరోజు ప్రతిపక్ష నేత సతీశన్, తదుపరి గోవా గవర్నర్ పాల్గొని సందేశాలు ఇవ్వబోతున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో వెటరన్ జర్నలిస్టులకు పెన్షన్ అందజేస్తున్నారని, ఈ విషయంలో పలు తారతమ్యాలు ఉండడం వలన దేశవ్యాప్తంగా జాతీయ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మహాసభలో ప్రధానంగా డిమాండ్ చేయబోతున్నట్లు పేర్కొన్నారు. 30 సంవత్సరాలపాటు జర్నలిజంలో రిపోర్టర్‌గా, డెస్క్ జర్నలిస్టుగా, ఫోటోగ్రాఫర్, ప్రూఫ్ రీడర్‌లుగా పలు వార్తా పత్రికల్లో పనిచేసిన తర్వాత గౌరవప్రదంగా సమాజంలో బతికేందుకు నెలకు రూ.20వేల పెన్షన్ అందజేయడం సబబుగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే జర్నలిస్టులకు రైల్వే పాసుల పునరుద్ధరణ, సంవత్సరంనకు రూ.10లక్షల తో ఆరోగ్య బీమా, పిఎఫ్ అమల్లో వెటర్న్ కు జరుగుతున్న ఇబ్బందులు తొలగించాలని మహాసభలో తీర్మానించబోతున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఏర్పటు చేయనున్న జాతీయ అసోసియేషన్ కు నిబంధనావళి రూపకల్పన చేయడం, జాతీయ నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి 20 మంది జర్నలిస్ట్ ప్రతినిధులు తిరువనంతపురం సభకు హాజరు అవుతున్నారని తెలిపారు. ఈ మహాసభలు జయప్రదం కోసం తోడ్పాటు నివ్వాలని పేర్కొన్నారు.

తలకోన ఆలయ నిర్మాణానికి రూ.19.13 కోట్లు



ప్రజాశక్తి - యర్రావారిపాలెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి నూతన ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం భూమి పూజ అట్టహాసంగా జరిగింది. భూమి పూజకు ముఖ్య అతిథిగా విచ్చేసిన టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడుకు పూర్ణకుంభంతో ఎమ్మెల్యే పులివర్తి నాని స్వాగతం పలికారు. అనంతరం టిటిడి చైర్మన్ బాలాలయంలో స్వామివారిని దర్శించుకుని పండితులచే వేద మంత్రాల నడుమ భూమి పూజ చేసి పండితులచే ఆశీర్వాదాలు అందుకున్నారు. మీడియాతో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ నుండి రూ.19.13 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో పురాతనమైనటువంటి తలకోన ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచిందని అన్నారు.త్వరితగతిన ఆలయ పునర్నిర్మాణం చేపట్టి తలకోన ఆలయ రూపురేఖలు మారి మరింత సుందరంగా ఆలయ నిర్మాణం రూపుదిద్దుకుంటుందని తెలిపారు.వాస్తు ప్రకారం నూతన పుష్కరిణి నిర్మాణం కూడా చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ముఖ్యమంత్రి చొరవతో తలకోన నూతన ఆలయం నిర్మాణం చేపట్టి మరింత అభివద్ధి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి రవీంద్ర రాజు, చైర్మన్ సోమనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి : ఎస్ఎఫ్ఐ



ప్రజాశక్తి - పాకాల :పాకాలలోని డిగ్రీ విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని పాకాల ఎంఆర్ఒ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, పాకాల ఎస్ఎఫ్ఐ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. పాకాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాలు లేక అవస్థలు పడుతున్నారని, ఎస్ఎంఎస్ హాస్టల్ లేదన్నారు. ఈ కారణంగా విద్యార్థులు డైలీ అప్ అండ్ డౌన్ చేయాల్సి వస్తోందన్నారు.పాకాలలో డిగ్రీ కళాశాలకు సొంత స్థం ఉన్నప్పటికీ నేటికీ సొంత భవనాలు ఎందుకు నిర్మించలేదన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోనే ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాకాలలో ఉందని, ఆ కళాశాలలో సరైన సౌకర్యాలు లేవన్నారు. విద్యార్థుకు గ్రౌండ్ లేక క్రీడలకు దూరమవుతున్నారన్నారు. తహాశీల్దార్ స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ప్రకాష్, శివ, సునీల్, రంజిత్, మనోజ్, సుదర్శన్, జగదీశ్, సమీర్, చందు, షాజహాన్, కార్తీక్,శివ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి




ప్రజాశక్తి - గూడూరు టౌన్ : చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ప్రభుత్వం తీసుకున్న భూములకు పరిహారం ఇవ్వాలని కోరుతూ తిరుపతి జిల్లా, కోట మండలం, గున్నంపడియ గ్రామానికి చెందిన రైతులు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. ఏవో శిరీషను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా న్యాయవాది అమృత్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములు తీసుకుని, పరిహారం ఇవ్వకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. సర్వే నంబర్లు 814, 811, 822, 824, 697, 807, 698, 817, 815లో సుమారు 200 ఎకరాలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. సాగుబడిలో ఉన్న భూమికి, రైతుకు ఎకరాకు 8 లక్షల రూపాయలు చెల్లించాలని ప్రభుత్వం జివో ఇచ్చిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం : కాంబాకం పంచాయతీ, రామిరెడ్డి పాలెం, గిరిజన కాలనీలో ఇళ్ల స్థలాలు, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఓటర్ గుర్తింపు కార్డులు తదితర మౌలిక అంశాలు పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని రాజ్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయానికి రెండు కిలోమీటర్ల దూరంలోని, రామిరెడ్డిపాలెం, గిరిజన కాలనీలో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని తెలిపారు. గతంలో అనేకసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చేయకుండా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే కాలంలో తీవ్రమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇచ్చిన హామీల మేరకు పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ నాయకులు చంద్ర, ఏఐవైఎఫ్ నాయకులు మురళి, నాగార్జున, సిపిఐ మండల కార్యదర్శి నాపాక కృష్ణమూర్తి, గిరిజన నాయకులు గంగయ్య, నాగరాజు, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు నమోదు చేసుకోండి

తొట్టంబేడు తహశీల్దార్ భారతి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) అన్నదాత సుఖీభవ అందని రైతులు, వారి పంచాయతీ, గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని తొట్టంబేడు తహశీల్దార్ భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెటిల్మెంట్ భూమి ఉండి అన్నదాత సుఖీభవ అందని రైతులు మాత్రమే నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. ఆధార్ నెంబర్, పాటు పట్టాదారు పాసుపుస్తకాలతో, సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ వద్ద నమోదు చేసుకోవాలన్నారు. విఆర్ఓను సంప్రదించి పట్టాదారు పాసుబుక్‌కి ఆధార్, ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవాలన్నారు. పట్టాదారు మృతి చెంది ఉంటే వాళ్ల కుటుంబీకుల పేరున మార్చుకోవడానికి రెవెన్యూ అధికారులను సంప్రదించాలన్నారు. తొట్టంబేడు మండలం మొత్తం మీద 963 మంది లబ్ధిదారులకు అన్నదాత సుఖీభవ అందలేదని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తిరుపతి కార్పొరేషన్‌కు 30 వినతులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. గిరిపురంలోడ్రైనేజీ కాల్వ నీరు ఇంట్లోకి వస్తోందని, చిన్నబజారువీధిలో సిసి రోడ్లు వేయాలని, నిమ్మకాయలవీధి, టికెస్ట్రీట్‌లలో డ్రైనేజీ సమస్య ఉందన్నారు. వికలాంగ పింఛన్‌కు దరఖాస్తు చేస్తే సదరన్ సర్టిఫికెట్‌లో తక్కువశాతం వికలత్వం ఉందని అర్హులు కాదంటున్నారని, యశోదానగర్‌లో వర్షపునీరు నిలిచిపోయి దుర్గంధభరితంగా తయారయ్యిందని, తల్లికి వందనం జమకాలేదని తదితర సమస్యలు వచ్చాయి. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై స్పందన



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజింగ్, నేచురల్ ఫామింగ్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ఏటీఎం మోడల్ వేసిన కూరగాయలు, ఆకుకూరలు స్పందనలో విక్రయించనున్నారు. వాటి ఆరోగ్య ప్రయోజనాలు గురించి ఆయన వివరించారు. ప్రకృతి వ్యవసాయ కూరగాయలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలుంటాయని, అధిక సంపాదన వస్తుంద న్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం ద్వారానే కూరగా యలు పండించి, వాటిని వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, ఆశా జయలక్ష్మి, ఎంపీడీవో, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీలు సత్ప్రవర్తనతో మెలగాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్: తిరుపతి, నెల్లూరు జిల్లాలో ఇటీవల క్రైమ్ రేట్ అధికమవుతోందని, దానిని అరికట్టేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. రౌడీయిజాన్ని అరికట్టే క్రమంలో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, గూడూరు డిఎస్పి గీతా కుమారి ఆదేశాల మేరకు రెండో పట్టణ పరిధిలోని రౌడీ షీటర్లను ఎస్సై సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో పోలీసులు బైండ్ ఓవర్ చేసుకొని, గూడూరు తహశీల్దార్ కార్యాలయం ముందు హాజరపరిచారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, రౌడీయిజం చేసినా, ఏ చిన్న గొడవ జరిగినా చట్టపరంగా చర్యలు, నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. అనంతరం 2 లక్షల రూపాయల పూచీ కత్తుపై విడుదల చేశారు.

వేద సదృశాలే ఆగమాలు



ప్రజాశక్తి - క్యాంపస్: వేదములు అపౌరుషేయములు సాక్షాత్తు భగవంతునిచే ఇవి ఉపదేశింపబడినవి, ఇవి స్వతః ప్రమాణములు భారతీయ సంస్కృతికి ఇవి దర్పణాలు, వేద సదృశములే ఆగమశాస్త్రములు, ఇవి భగవద్దత్తములు, ఆగామాలలోనే భగవంతునకు రూపకల్పన చేయబడింది అని మైలాపూర్ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డా. యస్. అరుణసుందరం పేర్కొన్నారు. రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ ఆగమ సంగోష్ఠి కార్యక్రమం సోమవారం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఆగమవిభాగ అధ్యక్షులు ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : సిపిఐ



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు) మండలంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ నాయకులు రోద్ద గోపి, శివకుమార్‌లు ఇంటి పట్టాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇక నైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. అనంతరం మండల తహశీల్దార్ భారతీకి వినతిపత్రం అందజేశారు.

రైతులకు ప్రత్యామ్నాయం చూపుదాం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి సింహాచలకండ్రిగ రిజర్వు ఫారెస్ట్ వివాదంపై రెవెన్యూ, అటవీశాఖ అధికారుల మధ్య సోమవారం సుదీర్ఘ చర్చలు జరిగాయి. అటవీ, రెవెన్యూ భూముల పరిధిపై అధికారులు రికార్డులు సరిపోల్చి చూశారు. 1978లోనే ఆ భూములు రిజర్వ్ ఫారెస్ట్ కింద కేటాయించడంతో రైతులకిచ్చిన పట్టాలు చెల్లవంటూ అటవీ శాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు తెల్పి చెప్పారు. అంతేకాకుండా 2016లో హైకోర్టు ఆదేశాల మేరకు ఇరు శాఖల సంయుక్త సర్వేలో కూడా ఆ విషయం తేటతెల్లమైందని, రైతుల విషయంలో జరిగిన తప్పిదం పట్ల రెవెన్యూ అధికారులే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ క్రమంలో బ్లాక్ నెంబర్ 1, 192లో ఉన్న వెయ్యి ఎకరాల భూమిపై సమగ్ర సర్వే చేయాలని, రిజర్వ్ ఫారెస్ట్ భూమిని మినహాయించి, అదనపు భూమి ఉంటే బాధిత దళిత రైతులకు పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా ఈ నెల 20వ తేదీన జిల్లా కలెక్టర్ ఎదుట సింహాచలకండ్రిగ రిజర్వ్ ఫారెస్ట్ వివాదంపై ఇరు శాఖల అధికారులు సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కూడా హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. ఆ సమావేశం సందర్భంగా సింహాచల కండ్రిగ రిజర్వ్ ఫారెస్ట్ భూ వివాదానికి, దళిత రైతులకు ఓ పరిష్కారం దొరికే అవకాశం ఉంటుందో లేదో చూడాలి మరి.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



ప్రజాశక్తి - క్యాంపస్ : కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. 29న జరగనున్న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా తిరుపతి ఎస్వీయు, తారకరామా స్టేడియంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నర్సింహ యాదవ్, ఏపీఐబీసీ చైర్మన్ సుగుణమ్మ, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఎనిమిది జిల్లాల నుంచి పదిహేడు వందల మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈనెల 29న నిర్వహించే స్పోర్ట్స్ డే వేడుకలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు, పతకాలు అందజేస్తామన్నారు. శాప్ డైరెక్టర్ రజని మాట్లాడుతూ క్రీడాకారులకు అత్యుత్తమ క్రీడా సదుపాయాలను కల్పించేందుకు శాప్ కృషి చేస్తుందని, క్రీడాకారులు కూడా పతకాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీఓలు శశిధర్, బాలాజీ, ఉదయ్, రాజు, జగన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి దళారులను ఆశ్రయించొద్దు : టిటిడి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులు దర్శనం, వసతి కోసం దళారులను ఆశ్రయించవద్దని, టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా, టోకెన్ జారీ కౌంటర్ల ద్వారా నమోదు చేసుకుని దర్శనం పొందాలని టిటిడి యాజమాన్యం భక్తులకు సూచించింది. ఇటీవల శ్రీవారి వీఐపీ బ్రేక్ టికెట్లు ఇప్పిస్తామని వనం నటరాజ నరేంద్ర కుమార్, కెఎస్. నటరాజ శర్మలు రూ 90వేలు తీసుకుని మోసం చేసినట్లు హైదరాబాద్‌కు చెందిన వై. శ్రీవిశ్వనాథ్. ఫిర్యాదు చేశారు. వై. శ్రీ విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు వనం నటరాజ నరేంద్ర కుమార్, కె.ఎస్. నటరాజ శర్మ లు వీఐపీ బ్రేక్ దర్శన టిక్కెట్లు ఇస్తామని చెప్పి 2024 ఆగస్టు 16వ తేదీ 12 మంది కోసం రూ.90వేలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. అప్పటి నుండి పలు మార్లు ఫోన్ చేసి తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరినప్పటికీ వారు స్పందించ లేదు. వై. శ్రీ విశ్వనాథ్ ఫిర్యాదు తరువాత టీటీడీ విజిలెన్స్ విభాగం విచారణలో నిందితులు హైదరాబాద్ జంట నగరాలలో పలువురిని ఇలాగే మోసం చేస్తున్నారని, వీరిపై ఇప్పటికే దాదాపు 12 పోలీస్ కేసులు నమోదయ్యాయి. దళారులపై అనుమానం వస్తే టిటిడి విజిలెన్స్ అధికారులు 0877-2263828 సదరు ఫోన్ నెంబర్ లో నిరంతరం అందుబాటులో ఉంటారని, ఫిర్యాదు చేయాలని టీటీడీ యాజమాన్యం సూచించింది.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై టీటీడీ ఈవో సమీక్ష

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలో ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2 వరకు జరగనున్న నేపథ్యంలో టీటీడీ ఈవో జె. శ్యామలారావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధన్ రాజులతో పాటు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి సోమవారం సాయంత్రం అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సెప్టెంబర్ 24న బ్రహ్మోత్సవాల తొలిరోజు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. 28న గరుడసేవ, అక్టోబర్ 2న చక్రస్నానం ఉంటుంది. రద్దీని ముందుగా అంచనా వేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఈవో ఆదేశించారు. వాహన రాకపోకలను అంచనా వేసేందుకు టెక్నాలజీ సాయం తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువమంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీటీడీ ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, సీఈ సత్యనారాయణ, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం జగదీష్ పాల్గొన్నారు.

తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారికి వెండి పట్టీల బహూకరణ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారికి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి నైనార్ మహేష్ యాదవ్, అనిత దంపతులు 450 గ్రాముల విలువచేసే వెండి పట్టీలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా బహూకరించారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్ సీ ముని కృష్ణ, ఆరణి జగన్, చింతా భరణి యాదవ్, దొడ్డారెడ్డి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో టీటీడీ ఈవో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల రెండో ఘాట్ రోడ్డులో టీటీడీ ఈవో జె. శ్యామలారావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంజినీరింగ్, హెల్త్ విభాగాల అధికారులకు ఘాట్ రోడ్డులో అవసరమైన చోట మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఘాట్ రోడ్డులో తగినంత సిబ్బందిని నియమించి తరచూ శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఈవో సూచించారు. ఈ తనిఖీల్లో ఇంజినీరింగ్, హెల్త్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నిషేధాజ్ఞల జారీ హేయమైన చర్య



ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల ప్రవేశంపై నిషేధాజ్ఞలు జారీ చేయడం హేయమైన చర్య అని విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఓబుల్ రెడ్డి అన్నారు. తిరుపతి ఎస్వీయూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతల నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెంగల్ రెడ్డి మండల అధ్యక్షులు గూడూరు రఫీ, యశ్వంత్ రెడ్డి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనిగుంటలో శానిటేషన్



ప్రజాశక్తి - తడ: తడ మండలం, చేనుగుంట కాలనీలో సోమవారం ఆరోగ్య సిబ్బంది శానిటేషన్ వర్క్ చేయించారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో వర్షం నీరు గ్రామంలోని రోడ్లపై నిలిచిపోవడంతో రోగాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లాంటివి చేశారు. బీపి, షుగర్ టెస్ట్‌లు ఉచితంగా చేసి ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సూపర్ వైజర్ మైథిలి, యం యల్ హెచ్ పి భార్గవి, హెల్త్ అసిస్టెంట్ హరిక్రిష్ణ, ఆశావర్కర్లు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కలివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ మురళీధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు బాల్య వివాహాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల, బాలికలు శారీరకంగా, మానసికంగా ఎదిగిన తర్వాత వివాహ చేసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. ఉన్నత విద్యావంతులై, ఆర్థికంగా స్థిరపడిన తర్వాత వివాహాలు చేసుకోవడం కటుంబ సంక్షేమానికి దోహదపడుతుందని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల అసిస్టెంట్ హెడ్మాస్టర్ జి.సురేష్ బాబు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠ శాల్లో అమలవు తున్న డొక్కా సీతమ్మ మధ్యా హ్న పథకంలో మెనూ ప్రకారం రుచిక రమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈవో మునిసుబ్రమణ్యం సూచించారు. నాణ్యమైన విద్యను బోధించాలని, ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఆయన తనిఖీలు నిర్వహించి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.